విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త
గురువారం 12, ఫిబ్రవరి 2026 

# పట్టాలెక్కేందుకు 'మెట్రో' జోరు!



ప్రాజెక్టు ఏర్పాటుకు త్వరితగతిన భూ సేకరణ
-ఇప్పటికే సర్వే చేపట్టిన 'రైజెస్' అనే ఎసఐఏ బృందం
-చురుగ్గా ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం -
సమావేశానికి హాజరైన అధికారులు, గ్రామస్తులు,
నిర్వాహకులు -స్టేషన్ల ఏర్పాటు ప్రైవేట్ ఆస్తుల్లో
కాకుండా ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు
చేయాలన్న బాధిత ప్రజలు

8లో






## ఐఎఫ్ఆర్-2026ను సమన్వయంతో
# విజయవంతం చేయాలి

**బీచ్ రోడ్డులో ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్**
**-ప్రజలకు ఎలాంటి అసౌకర్యం లేకుండా సమగ్ర ఏర్పాట్లకు ఆదేశాలు**



విశాఖపట్టణం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

విశాఖ వేదికగా జరగనున్న ఐఎఫ్ఆర్--2026, సిటీ పరేడ్ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. వీఎంఆర్డీఏ కమిషనర్ తేజ్ భరత్, జీవీఎంసీ అధికారులతో కలిసి బుధవారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. కాళీమాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు జరుగుతున్న ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్, ప్రధాన వేదిక, వీఐపీల సిట్టింగ్, వారి వాహనాల రాకపోకలు, సాధారణ ప్రజలకు వసతులు, బారికేడింగ్, క్యూలైన్లు, ఎల్ఈడీ స్క్రీన్ల ఏర్పాటు, పార్కింగ్ వసతి, కంట్రోల్ రూమ్ ఏర్పాటు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని విభాగాల సమన్వయంతో సమగ్ర ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. జెట్టీ ప్రాంతంలో ఉన్న పడవలను తాత్కాలికంగా ఇతర ప్రాంతాలకు తరలించాలనీ, అలాగే ఫైర్ షో, డ్రోన్ షో నిర్వహణకు అవసరమైన అనుమతులు ముందుగానే తీసుకోవాలనీ సంబంధిత అధికారులకు సూచించారు. సమన్వయం కోసం అదనపు వైర్‌లెస్ కమ్యూనికేషన్ సెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, భద్రత దృష్ట్యా కార్యక్రమ ప్రాంగణంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు, మెడికల్ క్యాంపులు, స్ట్రెచర్లతో కూడిన అంబులెన్సులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఏపీఐఐసీ గ్రౌండ్ వద్ద అవసరమైన చర్యలు చేపట్టి, గ్రౌండ్ లెవెలింగ్, సరిపడా లైటింగ్ ఏర్పాటు చేయడంతో 8వ పేజీలో

# ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ ఆవిష్కరణ



విశాఖపట్నం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలాకి శ్రీనివాసరావు అధ్యక్షతన ,2026 సంవత్సర డైరీ ఆవిష్కరణ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆముదలవలస నియోజకవర్గ ఎమ్మెల్యే పబ్లిక్ అండర్‌టేకింగ్ చైర్మన్ కూన రవికుమార్ విశిష్ట అతిథులుగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షులు కేశన శంకర విశిష్ట అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలాకి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 వేలకుపైగా బీసీ ఉద్యోగులు విద్యుత్ సంస్థల్లో విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి నమ్మకంతో, నిబద్ధతతో సేవలందిస్తున్నారు అని చెప్పారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో విద్యుత్ ఉద్యోగులు ఎల్లప్పుడూ ముందుంటున్నారు అని అన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వము వచ్చిన తర్వాత విద్యుత్ ఉద్యోగులు గత ప్రభుత్వంలో ఏర్పడిన పిఆర్సి సంక్షోభాన్ని ఉద్యోగులపై పెను భారాలు మోపి విషాదాన్ని నింపితే ఈ ప్రభుత్వము వాటి నుంచి ఉపశయనం కల్పించి పే-రివైజ్ చేసిందని చెప్పారు. అదే విధంగా డీఏ బకాయిల్లో రెండు డీఏలను ఒకేసారి మంజూరు చేయడం ఉద్యోగుల పట్ల ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. జేఎల్ఎంలను విద్యుత్ సంస్థల్లో విలీనం చేసి నియామక పత్రాలు అందించడం ఒక చారిత్రాత్మక నిర్ణయం అని తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా ట్రూ-డౌన్ ద్వారా విద్యుత్ టారిఫ్‌లను తగ్గించి వినియోగదారులకు ఉపశమనం కల్పించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కింది. అంతేకాకుండా 2019-23 కాలానికి సంబంధించిన రిటైల్ సప్లై ట్రూ-అప్ భారాన్ని ప్రజలపై మోపకుండా ప్రభుత్వం స్వయంగా భరించడం ప్రజా ప్రభుత్వ లక్షణానికి నిదర్శనంగా పేర్కొనవచ్చు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అమరావతిలో "క్వాంటమ్ వ్యాలీ" ప్రారంభించడం, విశాఖపట్నం కేంద్రంగా ఐటి అభివృద్ధి ద్వారా భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పెరిగి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది అని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వ వారి పీఎం-జన్ మన్, పీఎం సూర్యఘర్ వంటి పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంలో విద్యుత్ ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు అని పేర్కొన్నారు.

# 'గ్రేటర్' అభివృద్ధికి పక్కా ప్రణాళిక



**జోనల్ వ్యవస్థ మరింత పటిష్టంకు చర్యలు -ఐఎఫ్ఆర్ ద్వారా రోడ్లు సుందరీకరణ**
**-స్మార్ట్ సిటీ ద్వారా మురికివాడలు అభివృద్ధి -స్వచ్ఛ సర్వేక్షన్‌తో పారిశుద్ధ్యం**
**మెరుగుకు చర్యలు -తొలి దశలో వేలంపేట, ఇందిరానగర్‌లో మురికివాడల అభివృద్ధి**

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

మహా విశాఖ అభివృద్ధికి పక్కా ప్రణాళికతో దీర్ఘకాలిక అభివృద్ధి పనులను చేపడుతున్నట్టు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వెల్లడించారు. బుధవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో వివిధ అంశాలపై విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. జీవీఎంసీలో పరిపాలన సౌలభ్యం కోసం మరింత క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు జోనల్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు. 'గ్రేటర'లో వున్న పది జోన్లలో అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన విస్తృతం చేస్తామన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి నగరంలో జరగనున్న ఐఎఫఆర్ విన్యాసాలకు జీవీఎంసీ పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రూ. 16 కోట్లతో 26 రోడ్లను ప్రధానంగా అభివృద్ధి చేస్తున్నామని, గతంలో సమ్మిట్‌లో భాగంగా రూ.18.85 కోట్లతో 119 రోడ్లను నిర్మిస్తున్నామన్నారు. నగర సుందరీ కరణలో భాగంగా అనేక పనులు చేపడుతున్నామని ఆయన వివరించారు. ఈ పనుల్లో 90 శాతం మేర శాశ్వతంగా నగర అభివృద్ధికి దోహద పడేలా డిజైన్ చేశామన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.172 కోట్లతో నిధులతో స్మార్ట్ సిటీ ద్వారా (సాస్కీ) 8వ పేజీలో

# అంగరంగ వైభవంగా వైశ్యరాజు జ్యూయలర్స్ నూతన షోరూం సోమాజీగూడలో ప్రారంభం

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

హైదరాబాదు, సోమాజిగూడలో వైశ్య రాజు జ్యూయలర్స్ నూతన షోరూం అంగరంగ వైభ వంగా ప్రారంభమైంది. ఈ షోరూమును బుధ వారం సినీతార కాజల్ ఆగర్వాల్ చేతుల మీదగా ప్రారంభించారు. మొదటి కొనుగోలును జామి భోజరాజు చేసారు. వైశ్యరాజు జ్యూయలర్స్ మేనెజింగ్ డైరక్టర్ వైశ్యరాజు భద్రగిరి రాజు మాట్లాడుతూ, తమ ప్రయాణం ఏపీలోని విశాఖపట్నంలో ప్రారంభమై, ప్రస్తుతం 16వ బ్రాంచిగా హైదరాబాద్, సోమాజి గూడలో ప్రారంభమైనందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. విన్నూతమైన కలెక్షన్లతో ప్రారంభోత్సవ ఆఫర్ గా అన్ని రకాల 22కెటి బంగారు ఆభరణాలపై ప్లాట్ 6శాతం తరుగుకే ఆభరణాలను పొంద వచ్చునని వివరించారు. వీవీఎస్ క్లారిటీ, ఈఎఫ్ కలర్, ఐజీఐ సర్టిఫైడ్ డైమండ్ కారట్స్ రూ.49,500లు నుంచి ప్రారంభ మన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు లేదని, మజూరి లేదని, జీఎస్టీని కూడా కొనుగోలు దారు తరుపున తామే చెల్లిస్తామన్నారు. అదనంగా కేజి వెండి వస్తువుల కొనుగోలుపై కేజికి రూ.15,000లు వరకు తగ్గింపు వుందన్నారు. ఈ ఆఫర్ కొన్ని రోజులు మాత్రమేనని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ షోరూముకి విచ్చేసి, మా ప్రత్యేకమైన డిజైనరీ కలక్షనులు ఎంపిక చేసుకొని, ఈ ఆఫర్‌ని వినియోగించు కోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో వైశ్యరాజు జ్యూయలర్స్ చైర్మన్ వైశ్యరాజు ఫల్గుణరాజు, సంస్థ డైరక్టర్లు వైశ్యరాజు నరేష్, వైశ్యరాజు కిరణ్‌కుమార్ రాజు పాల్గొన్నారు.





# ఆరిలోవలో మహిళ దారుణ హత్య

**మెడలో బంగారం, ఇంట్లో నగదు అపహరణ**
**-రంగంలోకి దిగిన పోలీసులు.. సీసీ ఫుటేజీలు పరిశీలన**



8లో

# 'సమత'లో న్యూట్రిషన్ కౌన్సెలింగ్ క్లినిక్ ప్రారంభం

**- ముఖ్య అతిథిగా డాక్టర్ టి.విజయలక్ష్మి**



(విశాఖపట్నం - ప్రభాతవార్త)

నగరంలోని సమతా కళాశాల ప్రాంగణంలో బుధవారం న్యూట్రిషన్ కౌన్సెలింగ్ క్లినిక్‌ను ఘనంగా ప్రారంభించారు. విద్యార్థుల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడం, సమతుల్య ఆహారపుటలవాట్లపై మార్గనిర్దేశం చేయడమే లక్ష్యంగా ఈ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్టు ఆ కళాశాల డీన్, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్.విజయ రవీంద్ర తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ జి.విజయలక్ష్మి (సదరరన్ కాలేజీ ప్రిన్సిపాల్) మాట్లాడుతూ 'నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే సరైన పోషకాహారం అవసరమన్నారు. ఈ క్లినిక్ విద్యార్థులకు ఎంత గానో ఉపయోగపడుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.సారాబందీ మాట్లాడుతూ ఈ క్లినిక్‌లో విద్యార్థులకు ఆహార నియమాలు, బరువు నియంత్రణ, రక్తహీనత, షుగర్, జీవనశైలి సంబంధిత సమస్యలపై ఉచిత సలహాలు అందించనున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శిల్ప, న్యూట్రిషన్ విభాగ అధ్యాపకులు సమీం, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యువకుడు అనుమానస్పద మృతి



ఆనందపురం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

ఆనందపురం పంచాయతీ శివారు స్మశానం సమీపంలోని పందుల ఫారంలో బుధవారం ఉదయం ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మృతుడు తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి సమీపంలోని కొండగూడెంకు చెందిన సైనబరపు నాగశివ (38)గా గుర్తించారు. ఆయన గత ఆరు నెలలుగా అదే ఫారంలో వాచ్‌మన్‌గా పనిచేస్తూ భార్య షేక్ ముబీనా ఆలియాస్ శ్రావణితో కలిసి అక్కడే నివసిస్తున్నాడు. బుధవారం ఉదయం భర్త మృతి చెందినట్లు కావ్య 112 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వగా సీఐ వాసునాయుడు, నార్త్ సబ్ డివిజన్ (మధురవాడ) ఏసీపీ అప్పలరాజు, ఎస్ఐలు శివ, హరీష్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకున్నారు. ఏసీపీ అప్పలరాజు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆధారాలు సేకరించారు. మృతదేహంపై గాయాలు కనిపించడంతో కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో దంపతుల మధ్య తరచూ మనస్పర్థలు ఉండేవని వెల్లడైంది. నాగశివ మద్యం సేవించి భార్యపై శారీరక, మానసిక వేధింపులకు పాల్పడేవాడు. మంగళవారం రాత్రి కూడా ఇద్దరి మధ్య ఘర్షణ జరిగినట్లు తెలిసింది. ఈ క్రమంలో నిద్రలో ఉన్న నాగశివపై మారణ ఆయుధంతో దాడి చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ఫారం యజమాని ఆసనాల పైడ్రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిఐ వాసునాయుడు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రతిష్టాత్మక ఈవెంట్లకు విశాఖలో కట్టుదిట్టమైన భద్రత

**- హోటల్స్ యాజమాన్యాలతో సీపీ శంఖబ్రత బాగ్చి సమన్వయ సమావేశం**




(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

నగరంలో త్వరలో జరగనున్న ప్రతిష్టాత్మక 'ఐఎఫ్ఆర్, మిలాన్, ఐయా న్స్-కాన్‌క్లేవ్ ఆఫ్ చీఫ్స్' కార్యక్రమాల దృష్ట్యా భద్రతా ఏర్పాట్ల పై పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చి హోటల్స్ యాజమాన్యాలతో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశానికి సుమారు 100 హోటళ్ల యాజమాన్య ప్రతినిధులు హాజరయ్యారు. డీసీపీలు, ఫారినర్స్ రీజనల్ రిజిస్ట్రేషన్ అధికారులు, స్పెషల్ బ్రాంచ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణ, విదేశీ ప్రతినిధులు , పర్యాటకుల భద్రత దృష్ట్యా పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి హోటల్‌లో భద్రతా అధికారిని లైజన్ ఆఫీసర్‌గా నియమించి, పోలీసు ,నేవీ అధికారులతో నిరంతర సమన్వయం కొనసాగిం చాలని సూచించారు.విదేశీ అతిథుల చెక్-ఇన్ ప్రక్రియలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని, 24 గంటల్లోపు ఫామ్-3(పాత ఫామ్-సి) సమర్పించాలన్నారు. హోటళ్ల ప్రవేశ ద్వారాల వద్ద డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్లు, హ్యాండ్ హెల్డ్ మెటల్ డిటెక్టర్లు పనిచేసేలా చూడాలని, పార్కింగ్, కారిడార్లు సహా అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు సమర్థంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆహారం, పానీయాల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నీటి నాణ్యతపై రోజువారీ పరీక్షలు నిర్వహించాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితు ల్లో వైద్య సదుపాయాలు, అంబులెన్స్ సిద్ధంగా ఉంచడంతో పాటు సమీప



ఆసుపత్రులతో ఒప్పందాలు చేసుకో వాలన్నారు. అగ్నిమాపక పరికరాలు సక్రమంగా ఉండేలా తనిఖీలు చేసి, సిబ్బందికి ఫైర్ డ్రిల్స్ నిర్వహిం చాలని సూచించారు. మీఅత్యవసర తరలింపు ప్రణాళిక సిద్ధంగా ఉంచి, భవన బ్లూప్రింట్లు పోలీసులతో పం చుకోవాలని, అన్ని ఎమర్జెన్సీ ఎగ్జిట్ మార్గాలు వినియోగయోగ్యంగా ఉండాలని తెలిపారు. హోటల్ సిబ్బందికి తప్పనిసరిగా పోలీస్ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు.విదేశీ ప్రతినిధులు లేదా వీవీఐపీలు బస చేసిన ప్పుడు వారి భద్రత, గోప్యతకు భంగం కలగకుండా చూడాలని, అనుమతి లేకుండా ఫోటోలు లేదా సెల్ఫీలు తీయడం చట్టవిరుద్ధమని హెచ్చరించారు.నగర భద్రతలో హోటల్ యాజమాన్యాలు పూర్తి సహకారం అందిం చాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీపీ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు. ఏదైనా అను మానాస్పద పరిస్థితులు గమనిస్తే వెంటనే 7995095799 నం.కు సమాచారం అందించాలని సూచించారు.

# విశాఖలో తొలిసారిగా 'సైమా ప్రొఫెషనల్ ఎక్స్‌పో'



విశాఖపట్నం ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

అందం, ఆరోగ్యం (బ్యూటీ అండ్ వెల్నెస్) రంగంలో అంత ర్జాతీయ ప్రమా ణాలను విశాఖ వాసులకు పరి చయం చేస్తూ "సైమా ప్రొఫెష నల్ బ్యూటీ ఎక్స్‌పో" నగరంలోని ఆశీలమెట్ట వద్ద గల కెపి పాల్ కన్వెన్షన్‌లో ఘనంగా జరిగింది. కిడ్స్, బ్రైడల్, మేన్స్, ఫెషన్ షో అలరించింది. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ మాట్లాడుతూ, ఇప్పటి వరకు దేశంలోని మెట్రో నగరాలకే పరిమితమైన ఇటువంటి ప్రతిష్టాత్మ కమైన ప్రీమియం ఎక్స్‌పోను ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా విశాఖపట్నంలో నిర్వహించడం సంతోషదాయ కమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ బ్యూటీ నిపుణులను, ప్రముఖ బ్రాండ్లను, పంపిణీదారుల ను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ ఎక్స్‌పో ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఎక్స్‌పో నిర్వాహకుడు మోక్ష మాట్లాడుతూ బ్యూటీ అండ్ వెల్నెస్ సెక్టార్‌లో వస్తున్న సరికొత్త మార్పులు, ఉత్పత్తులు ఆవిష్కరణలను ఇక్కడ ప్రదర్శించడం జరిగింది అన్నారు.. ప్రఖ్యాత బ్యూటీ బ్రాండ్లు, స్కిన్ కేర్ సొల్యూషన్స్, హెయిర్ కేర్, కాస్మెటిక్స్, నెయిల్ కేర్ స్పా సేవలకు సంబంధించిన స్టాళ్లు సందర్శకులను అలరించనున్నాయి. కేవలం ప్రదర్శన మాత్రమే కాకుండా, నిపుణుల ద్వారా ప్రత్యేక వర్క్ షాప్‌లను కూడా నిర్వహించమన్నారు తద్వారా ఔత్సాహికులు నూతన మెళకువలను నేర్చుకునే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

# ఐఎఫ్ఆర్-2026ను సమన్వయంతో ..

7వ పేజీ తరువాయి ..

పాటు పొదలు తొలగించాలన్నారు. ప్రజలు కార్యక్రమాన్ని స్పష్టంగా వీక్షించేందుకు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేసి, లైవ్ స్ట్రీమింగ్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, సాధారణ ప్రజల కోసం 100 మొబైల్ టాయిలెట్లు, అలాగే పార్కింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. వైఎంసీఏ నుంచి కాళీమాత ఆలయం వరకు నిర్వహించనున్న కంటింజెంట్ కార్యక్రమం సజావుగా సాగేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి, పాల్గొనే వారికి అదనపు వసతులు కల్పించాలని చెప్పారు. ప్రజల సౌకర్యార్థం బీచ్ వైపు 1,000 మంది వీక్షించగలిగేలా సరిపడా ప్రత్యేక ఎన్‌క్లోజర్లు ఏర్పాటు చేసి, ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమం ప్రశాంతంగా, క్రమబద్ధంగా, విజయవంతంగా నిర్వహించేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా కోరారు. నేవీ, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# పట్టాలెక్కేందుకు..

(ప్రభాతవార్త-విశాఖపట్నం)

విశాఖ 'మెట్రో'ను త్వరితగతిన పట్టాలెక్కించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో వుంది. ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో.. పనుల కదలికలో స్పీడ్ పెరిగింది. మొదటి దశ మూడు కారిడార్ల నిర్మాణానికి.. ఆ మూడు మార్గాల్లో ముందస్తుగా మార్కింగ్ ప్రక్రియ ఇప్పటికే దాదాపుగా పూర్తికాగా.. ప్రస్తుతం కారిడార్ల(1, 2, 3) నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు ప్రజాభిప్రాయ సేకరణను ముమ్మరం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మెట్రో రైలు విస్తరణ, అభివృద్ధిలో భాగంగా విశాఖ జిల్లాలో రైలు ప్రాజెక్టు కింద తొలిదశలో 46.23కి.మీ పొడవ మేర మూడు మార్గాల్లో కారిడార్లను నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ పథకం కింద గాజువాక మండలంలో వడ్లపూడి, చినగంట్యాడ, గాజువాక, మింది, అక్కిరెడ్డిపాలెం, తుంగలాం గ్రామాలతో పాటు గోపాలపట్నం మండలంలో గోపాలపట్నం, బుచ్చి రాజుపాలెం, మర్రిపాలెం, కప్పరాడ గ్రామాలు, అర్బన్ విశాఖలో దొండపర్తి, అల్లిపురం ఎక్స్‌టెన్షన్. కంచరపాలెం, రేసపువానిపాలెం, మద్దిలపాలెం, వెంకోజీపాలెం గ్రామాలు, విశాఖ రూరల్ మండలంలో చినగదిలి. ఎండాడ, పోతినమల్లయ్య పాలెం, మధురవాడ గ్రామాలు, సౌత్ జోన్‌లోని అల్లిపురం వార్డు, వాల్తేరు వార్డు, ఫోర్టు వార్డు, గోడేవారి వార్డు, మార్కెట్ యార్డ్, అల్లిపురం వార్డు మీదుగా క్రమ పద్ధతి(ఎలైన్మెంట్)లో తయారు చేసి ఎంపిక చేశారు.

### 96.11ఎకరాల గుర్తింపు..

మూడు కారిడార్లకు ఆయా పనుల కోసం 96.11ఎకరాల అవసరమవుతోందని అంచనా వేశారు. అయితే.. భూసేకరణ చట్టం 2013 ద్వారా 9.11 ఎకరాల పట్టా భూమిని (87ఎకరాలు ప్రభుత్వ భూమి) సేకరించాల్సిన అవసరం ఏర్పడింది. అందులో భాగంగా తొలుగా 'సోషల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ (ఎసఐఏ) తయారు కావాల్సిఉంది. సంబంధిత నివేదిక తయారు చేసేందుకు భూ సేకరణ, ఆరఅండఆర్ కమిషనర్, జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా 'రైజెస' అనే ఎసఐఏ బృందాన్ని నియమించారు. ఆ బృంద సభ్యులు గతేడాది జూన్ 16 నుంచి జూలై వరకు, గత జనవరి 19 నుంచి గత నెల 24 వరకు భూ సేకరణకు కావాల్సిన భూములతో పాటు నష్టపోనున్న గృహ, వ్యాపార నివాసాల్లో పర్యటించి బాధితుల సామాజిక, ఆర్థిక, సాంఘిక స్థితిగతుల్ని తెలుసుకున్నారు. సర్వే చేపట్టి పూర్తి వివరాల్ని నమోదు చేసుకున్నట్టు తెలుస్తోంది.

### ప్రజాభిప్రాయాలకు శ్రీకారం..

'మెట్రో' ప్రాజెక్టు ఏర్పాటుకు అవసరమైన భూ సేకరణ కోసం ప్రజాభిప్రాయాలకు శ్రీకారం చుట్టారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమీపంలో వున్న వేమన మందిరంలో ఈ నెల 10వ తేదీన విశాఖ ఈస్ట్ జోన్ జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో కూడా ఈ బృందం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టింది. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.సుధాసాగర్‌తో పాటు 28వ వార్డు కార్పొరేటర్ పల్లా దుర్గారావు హాజరై మాట్లాడారు. కారిడార్ 1, 3కు సంబంధించి భూ, నివాస, వ్యాపార, ఖాళీ స్థలాలకు సంబంధించిన నిర్వాసితులు కూడా హాజరయ్యారు.

### కారిడార్ 1, 3 ఏర్పాటు కోసం కోల్పోనున్న పలు ఆస్తులు..

ఈ సర్వేలో భాగంగా కారిడార్ 1, 3 ఏర్పాటులో భాగంగా పలు ఆస్తులను కోల్పోనున్నారు. మొత్తం 286 గృహ, వ్యాపార, ఖాళీ స్థలాలు నష్టపోనున్నాయని, వాటిలో 88 ఇళ్లు పూర్తిగా, స్వల్పంగా మరో 198 ఇళ్లు నష్టపోనున్నాయని అధికారులు స్పష్టం చేశారు. అదే విధంగా కారిడార్-1లో మొత్తం 94 నివాస, వ్యాపార, ఖాళీ స్థలాలు నష్టపోనున్నాయి. వాటిలో 55 ఇళ్లు, ప్రహరీలు, ఖాళీ స్థలాలు స్వల్పంగా, 39 ఇళ్లు పూర్తిగా నష్టపోనున్నాయన్నారు. కారిడార్-2లో మొత్తం 158 నివాస, వ్యాపార, ఖాళీ స్థలాలు నష్టపోనున్నాయి. వాటిలో 118 ఇళ్లు, ప్రహరీలు, ఖాళీ స్థలాలు స్వల్పంగా, 40ఇళ్లు పూర్తిగా నష్టపోనున్నాయని అధికారులు తెలిపారు. అదే విధంగా కారిడార్-3లో మొత్తం 34 ఇళ్లకు సంబంధించి నివాస, వ్యాపార, ఖాళీ స్థలాలు నష్టపోనున్నాయని, వాటిలో 9 ఇళ్లు పూర్తిగా, 25 ఇళ్లకు స్వల్పంగా నష్టపోనునున్నాని బృందం నిపుణులు పి. దేవరాజు తెలియజేశారు. ఇదిలా ఉంటే నిర్వాసితులు, ప్రజలు ఈ ప్రాజెక్టు తమ అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తెలియజేసేందుకే ఈ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నామన్నారు. వాటన్నింటినీ రికార్డు చేసి, ఒక నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు సమర్పిస్తామన్నారు. ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా అధిక శాతం నిర్వాసితులు స్టేషన్ పాయింట్లను ప్రైవేట్ ఆస్తుల కంటే ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసుకుంటే మంచిదన్నారు. దీంతో వారి అభిప్రాయాల్ని నమోదు చేసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఎసఐఏ బృంద సభ్యుడు, పర్యావరణ, సామాజిక నిపుణుడు ఎ. మాధవరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రామలక్ష్మి, సర్వేయర్ శ్రీనుబాబు, ఆర్.వీరభద్రరావు తదితరులు హాజరయ్యారు. వారితో పాటు రైజెస్/ఎసఐఏ సభ్యులు శ్రీనివాస్, హరిచరణ్, మెట్రో రైల్ ప్రాజెక్ట్ ఇంజినీర్ ఎన్.వసంత్ కుమార్, కె. లక్ష్మణ్, రెవెన్యూ సిబ్బంది, భూ నిర్వాసితులు, తదితర ప్రజలు పాల్గొన్నారు.

# ఆరిలోవలో మహిళ దారుణ హత్య

ఆరిలోవ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో కాపు లక్ష్మి (48) అనే మహిళ దారుణ హత్య బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... ఆరిలోవ కాలనీ దుర్గా బజార్ సెక్టార్-3లో కాపు రమణ లక్ష్మీదంపతులు నివాసముంటున్నారు. భర్త రమణ జీవీఎంసీ ఉద్యోగి. లక్ష్మి గత 15 సంవత్సరాలుగా చీటీలు అదే ప్రాంతంలో నడుపుతూ ఉంటుంది. బుధవారం సాయంత్రం తన భర్త డ్యూటీ నుండి ఇంటికి వచ్చి చూసేసరికి లక్ష్మీ శవమై మంచంపై పడి ఉండడంతో కంగారుపడి పోలీసులకు సమాచారం అందజేశారు. ఇంట్లో ఉన్న ఐదు లక్షల నగదు, మెడలో ఉన్న బంగారం, చేతి ఉన్న బంగారు గాజులు లేకపోవడంతో లక్ష్మీ ను గుర్తుతెలియని వ్యక్తి హత్య చేసి బంగారం అపహరించినట్లు గమనించారు. రంగంలోకి దిగిన ద్వారక ఏసిపి అన్నెపు పు నరసింహమూర్తి, సీఐ సిహెచ్. మల్లేశ్వరరావు తో పాటు క్రైమ్ సీఐ చక్రధర్ ఎస్సైలు రాందాసు, హరికృష్ణ సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకొని మృతిచెందిన మహిళ ఇంటికి ఉన్న సిసి ఫుటేజ్లు అదేవిధంగా వీధిలో ఉన్న సిసి ఫుటేజీలు పరిశీలించి, చుట్టుపక్క వారు వద్ద నుండి ముఖ్యమైన వివరాలు సేకరించారు. అయితే ఉదయం 10:30 గంటలకు ఓ వ్యక్తి తన ఇంటిలోకి ప్రవేశించిన మరల 12:30 గంటలకు మహిళ ఇంట్లో నుండి వెను తిరిగినట్లు సిసి ఫుటేజ్ ద్వారా తెలుస్తున్నట్లు సమాచారం.

# ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకటరావు సేవలు ప్రశంసనీయం

**సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు కె. సదారావు**

**-డివిజనల్ పీఆర్వోలుగా పదోన్నతి పొందిన ఇద్దరికీ ఆత్మీయ సత్కారం**



విశాఖపట్నం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకటరావు శాఖకు అందించిన సేవలు ప్రశంసనీయమని సమాచార పౌర సంబంధాల శాఖ ఉప సంచాలకులు కె. సదారావు అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల ప్రచారం, ప్రజలతో అనుసంధానం, మీడియాతో సమన్వయం వంటి అంశాలలో వారు సమర్థవంతంగా పనిచేశారని కొనియాడారు. డివిజనల్ పీఆర్వోలుగా పదోన్నతి పొందిన సందర్భంగా మంగళవారం స్థానిక సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో వారిద్దరినీ ఆత్మీయంగా సత్కరించారు. జ్ఞాపికలు అందజేసి, దుశ్శాలువా కప్పి సన్మానించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో సేవలు అందించాలని, కొత్త బాధ్యతల్లోనూ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా పనిచేయాలని ఆకాంక్షించారు. ఉత్తమ పనితీరును కనబరిచి అందరి ప్రశంసలూ అందుకోవాలన్నారు. శ్రీనివాసరావు పదోన్నతిపై అనకాపల్లి జిల్లాకు వెళ్తుండగా, వెంకటరావు అల్లూరి సీతారామరాజు జిల్లాకు బదిలీపై వెళ్తున్నారు. కార్యక్రమంలో డివిజనల్ పీఆర్వో నారాయణరావు, ఏఐఈ రామకృష్ణ, పీఆర్వో కిశోర్, సీనియర్ అసిస్టెంట్ లావణ్యతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొని అభినందనలు తెలిపారు.

# 'గ్రేటర్' అభివృద్ధికి పక్కా ప్రణాళిక

7వ పేజీ తరువాయి ..

నిర్మిస్తున్న వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్స్‌ను త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. గాజువాక, ముడసర లోవ, మధురవాడ ప్రాంతాల్లో మార్చి నెలాఖరికి 50 శాతం పనులు పూర్తయ్యాలా ప్రయత్నం చేస్తున్నామన్నారు.

### మురికివాడల అభివృద్ధికి ప్రణాళిక

విశాఖ ఎకనామిక్ రీజన్(వీఈఆర్) ద్వారా మురికివాడల అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ వివరించారు. మొదటి విడతలో సౌత్ జోన్‌లో వున్న వేలంపేట మురికివాడ అభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రూ.23.17 కోట్లతో 177 ఇళ్ళను 59 సెంట్లు స్థలంలో పీపీపీ తరహాలో జీ+11 అంతస్తులను నిర్మించనున్నట్టు వివరించారు. ఇందిరానగర్‌లో 110 మంది లబ్ధిదారులకు రూ.17 కోట్లతో జీ+6 అంతస్తుల గృహ సముదాయాన్ని నిర్మిస్తున్న మన్నారు. నగరంలో ఇప్పటివరకు 660 మురికివాడలు ఉన్నాయన్నారు. వీటిలో రాష్ట్ర ప్రభుత్వం నిధులతో 50 మురికివాడలు, కేంద్ర ప్రభుత్వం నిధులతో 16 మురికివాడలను అభివృద్ధి చేసేందుకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వెల్లడించారు. నగరంలో మూడు వెండర్ జోన్లను గుర్తించామని, త్వరలో వాటి ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామన్నారు.

### భోగాపురం విమానాశ్రయం అనుసంధాన రహదారుల అభివృద్ధి

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అనుసంధాన రహదారులను అభివృద్ధి చేసే ప్రణాళికలో భాగంగా జీవీఎంసీ 7 రోడ్లను అభివృద్ధి చేస్తుందని కమిషనర్ కేతన్‌గార్గ్ వివరించారు. వీఎంఆర్డీఏ సహకారంతో సమన్వయం చేసుకొని రోడ్ల విస్తరణ నిర్మాణానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికే 205 మంది రైతులు అంగీకారం తెలియజేశారని, వారందరికీ టీడీఆర్‌లు అందజేస్తామన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో జీవీఎంసీ ఈ ఏడాది కూడా మెరుగైన స్థానం సంపాదించుకునేందుకు, పారిశుద్ధ్య పనులు మరింత మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

### త్వరలోనే నైట్ శానిటేషన్ ప్యాకేజీల పునరుద్ధరణ

త్వరలోనే నైట్ శానిటేషన్ ప్యాకేజీలను పునరుద్ధరణ చేస్తామని, తద్వారా ఉదయం పూట పారిశుధ్య నిర్వహణ పనులు కొంత సులభతరం అవుతాయని కేతన్‌గార్గ్ ఆశాభావం వ్యక్తం చేశారు. వీధి దీపాల నిర్వహణ సవాల్‌గా మారిందని, త్వరలోనే జోన్ వారీగా టెండర్ల పిలిచి వీధి దీపాల నిర్వహణ మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. ప్రస్తుతం పన్నులు వసూళ్లు పై కేంద్రీకరణ చేస్తున్నామని , ఆదాయ మార్గాలను పటిష్టం చేస్తే అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టవచ్చునని ఆశాభావం వ్యక్తం చేశారు. మొండి బకాయిలు దారులకు నోటీసులుతో పాటు జప్తులు కూడా చేపడుతున్నామని తెలియజేశారు. నీటి సరఫరాతో పాటు జీవీఎంసీలో అన్ని రకాల సేవలను మరింత పటిష్టపరిచేందుకు ప్రణాళికబద్ధంగా ముందుకు వెళుతున్నట్టు ఆయన వివరించారు.

# 'గ్రేటర్' సిటీ ప్లానర్ మీనా కుమారి సరెండర్

**-అక్రమాలకు నో చెప్పడంతోనే సరెండర్‌కు కుట్ర**

(ప్రభాతవార్త-విశాఖపట్నం)





జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న సిటీ ప్లానర్ 2 వి.మీనా కుమారిని ప్రభుత్వానికి సరెండర్ చేశారు. జాయింట్ డైరెక్టర్ హోదా కలిగిన ఒక మహిళ అధికారిని తొలి సారి జీవీఎంసీ కమిషనర్ ఇలా ప్రభుత్వానికి సరెండర్ చేయడం కార్పొరేషన్ లో సర్వత్రా చర్చనీయాం శంగా మారింది. టౌన్ ప్లానింగ్ విభాగంలో నిత్యం జరుగుతున్న అవినీతి అక్రమా లపై ఇప్పటికే పలువురు ప్లానింగ్ సెక్రటరీలకు సోకాజ్ నోటీసులు జారీ చేయడం, మరికొంత మందిని సస్పెండ్ చేసిన కమిషనర్ ఈసారి ఏకంగా సిటీ ప్లానర్‌నే సరెండర్ చేయడం వెనక పెద్ద కథే నడిచిందని ప్రచారం సాగుతుంది. టౌన్ ప్లానింగ్‌లో వర్గ పోరు ఓ పక్క ఉండగా, మరోపక్క నగరంలో పలువురు బిల్డర్లు, రాజకీయ నేతలకి అనుకూలంగా కాకుండా.. ఆమె నిక్కచ్చిగా వ్యవహరించిన కారణంగానే ఆమె సరెండర్‌కు గురైనట్టు ప్రచారం జరుగుతోంది. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో వర్గపోరులో భాగంగా సీసీపీతో అగాధం ఏర్పడిందనే వాదన బలంగా వినిపిస్తోంది. ఇదిలావుండగా.. పలువురు బిల్డర్లు, రాజకీయ నేతలు వారికి అనుకూలంగా వ్యవహరించకపోవడంతో తరచూ కమిషనర్‌కి ఫిర్యాదులు చేయడంతోనే, ఆయన ప్రభుత్వానికి సరెండర్ చేసినట్టు తెలుస్తోంది. ముఖ్యంగా ఈ సరెండర్‌కు కారణం ఇదేననే ప్రచారం కూడా లేకపోలేదు. 'గ్రేటర్' సీసీపీ చేస్తున్న అక్రమాలకు అడ్డుగా ఉన్న మీనాకుమారిని తొలగించుకోవాలని కమిషనర్‌కు మీనా కుమారిపై లేనిపోనివన్నీ చెప్పి ఆమెను సరెండర్ చేసేలా, ఆయన కుట్ర చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ఈ కుట్రకోణం అంశంపై పెద్ద ఎత్తున టౌన్ ప్లానింగ్ విభాగంలో ప్రచారం సాగుతుంది. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో సీసీపీ అనుచర వర్గం రాజ్యమేలుతోందనే వాదన వుంది. ముక్కు సూటిగా వ్యవహరించే మీనా కుమారి జాయిన్ అయినప్పటి నుంచి అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్న సీసీపీ, జీవీఎంసీ కమిషనర్ ద్వారా సరెండర్ చేయించినట్టు ప్రచారం జరుగుతోంది.

# అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు

**భద్రత, మౌలిక వసతుల కల్పన, ఇతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష**



విశాఖపట్టణం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15వ తేదీన జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఉదయం తన ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. మహాశివరాత్రి సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చే అవకాశం ఉన్నందున భద్రత, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్, వైద్య సదుపాయాలు వంటి అన్ని మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు సక్రమంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన చోట తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విశాఖపట్టణం ఆర్డీవో సుధాసాగర్, డీఎండహెచ్వో జగదీశ్వరరావు, ఎండోమెంట్ అధికారులు, ఆలయ ఈవో పద్మావతి, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేడు పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

**నివాసితులు వ్యర్థాలు బహిరంగ ప్రదేశాలలో వేయొద్దు -జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**

విశాఖపట్నం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త



దేశవ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులు గురువారం సమ్మెలో పాల్గొంటున్నందున జీవీఎంసీ పరిధిలోని ప్రజలు తమ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో వేయరాదని బుధవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ నగర ప్రజలకు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. జీవీఎంసీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు గురువారం సమ్మెలో పాల్గొంటున్న కారణంగా విధులకు హాజరు కానందున ఆరోజు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో పడవేయరాదని, మరుచటి రోజు శుక్రవారం తమ వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు లేదా క్లాప్ వాహనాలకు వ్యర్థాలను అందించగలరని జీవీఎంసీ కమిషనర్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

**FOR SALE**

★ గజపతి నగరం 100 చ.గజాల భూమి - - ఫ్రూట్ ప్రాఫిట్ షేరింగ్‌తో 80 నెలల పాటు ప్రతి నెల ₹ 5,000 ఆదాయం సంపాదించండి. 6304674818.
(Ro.No.42745)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

# జీవీఎంసీ కమీషనర్ కేతన్ గార్గ్, ఐఏఎస్‌తో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల భేటీ






గాజువాక,ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

నగర ప్రజలు ఎదుర్కొం టున్న వివిధ సమస్యలను పరిష్కరించేందుకు విశాఖ పట్నంలో జీవీఎంసీ అధికారులతో రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతి నిధులు ముఖ్య సమావేశం నిర్వహిం చారు. జీవీఎంసీ కమీషనర్ కేతన్ గార్గ్, ఐఏఎస్ అధ్యక్షతన బుధవారం జరిగిన ఈ సమావేశంలో ప్రజా సమస్యలపై విస్తృతం గా చర్చించారు. శ్రీనివాసనగర్ (వెస్ట్) నివాసితుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కె.రామకృష్ణం రాజు మాటా డుతూ జీవీఎంసీ వార్డులు 40,58-62 పరిధిలోని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యం గా పెరుగుతున్న శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యంపై ఆందోళన వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తగులబెట్టడం వల్ల భారీగా పొగ వ్యాపించి ప్రజలు ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. కలుషిత వాతావరణం కారణంగా శ్వాసకోశ వ్యాధులు పెరుగుతున్నా యని, ప్రజల ఆరోగ్య భద్రత కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజల సమస్యలను సవివరంగా వివరిస్తూ రూపొం దించిన 12 పేజీల వినతి పత్రాన్ని జీవీఎంసీ కమిషనర్ ,జోనల్ కమిషనర్ లకు సమర్పించారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా సమస్యలపై తక్షణ స్పందన ఇవ్వాలని, శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

# పాండ్రంగి గ్రామంలో ఘనంగా దీన దయాళ్ ఉపాధ్యాయ సంస్మరణ దినోత్సవం

పద్మనాభం,ఫిబ్రవరి 11, ప్రభాతవార్త



మండలంలో పాండ్రంగి గ్రామంలో బి జె పి అధిష్టానం పిలుపు మేరకు బుధవారం బిజెపి కన్వీనర్ రూపాకుల రవికుమార్ ఆధ్వర్యంలో పండింట్ దీన దయాళ్ ఉపాధ్యాయ సంస్మరణ దినోత్సవంను బిజెపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి ఆయనతో పాటు నాయకులు కృష్ణారావు, మచ్చ సోమేష్, గౌరీరెడ్డి, శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళ అర్పించారు. అనంతరం రవికుమార్ మాట్లాడుతూ 1968 ఫిబ్రవరి 11న మొగల్ సరాయిలో అనుమానాస్పదంగా మృతిచెందారని,ఇతను మృతి దేశానికి తీరనిలోటని అన్నారు.ఏకాత్మత, మానవతావాదం, అంత్యోదయం వీరి సిద్ధంతమని అన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ, ఆదిలక్ష్మి, సూర్యకాంతం పాల్గొన్నారు.

# మార్చి 1న రాష్ట్రస్థాయి కరాటే పోటీలు

## -ట్రోఫీ ఆవిష్కరించిన హీరో సుమన్ కేఎన్ఆర్ సతీష్



గాజువాక,ఫిబ్రవరి 11,ప్రభాతవార్త

15వ ఏపీ వొడాకాయ్ కరాటే డు ఛాంపియన్షిప్ ట్రోఫీను సినీ హీరో, మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ సుమన్ తల్వార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. హెచ్‌బి కాలనీ డ్రాగన్ ఫోర్స్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా సుమన్ తల్వార్, విశిష్ట అతిథిగా బిజెపి రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ కర్ణంరెడ్డి నరసింగరావులు విచ్చేసారు. ఈ సందర్భంగా వారిరువురూ మాట్లాడుతూ.. విశాఖ వేదికగా కరాటే పోటీలను నిర్వహించడం విశాఖ పేరు ప్రతిష్టలు మరింతగా ఇనుమడిస్తాయన్నారు. ఇంత పెద్ద ఎత్తున క్రీడా పోటీలు నిర్వహించడం చిన్న విషయం కాదన్నారు. క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను కనబరచాలన్నారు. వొడాకాయ్ కరాటే డు కరాటే సంఘం అధ్యక్షుడు సిహెచ్ సతీష్ కుమార్ మాట్లాడుతూ.. మార్చి 1న మురళినగర్ బొత్స స్క్వేర్‌లో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనడానికి వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు విచ్చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం వారంతా కలిసి ఛాంపియన్షిప్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సూర్యనారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షుడు పరశురాం రాజు, బిజేపి నేత బొత్స సురేష్, కరాటే స్టేట్ డైరెక్టర్ అనిల్, ఏక్సిస్ బ్యాంకు ఉద్యోగి ఉషారాణి, సీనియర్ కోచ్‌లు పాల్గొన్నారు.

# ఘనంగా పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ సమర్పణ దివస్

గాజువాక,ఫిబ్రవరి 11,ప్రభాతవార్త



స్వర్గీయ పండిత్ శ్రీ దీనదయాళ్ ఉపాధ్యాయ సమర్పణ దివస్ సందర్భంగా గాజువాక పాతకర్నవానిపాలెం బిజెపి కార్యాలయంలో నియోజకవర్గం ఇంచార్జ్ రాష్ట్ర మీడియా పేనలిస్ట్ కరణంరెడ్డి నరసింగరావు ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ జన్ సంఘ్ పార్టీ సిద్ధాంతకర్త పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ అని అన్నారు. అంత్యోదయ ఏకాత్మ మానవతా దర్శనం సిద్ధాంతం ద్వారా అట్టడుగున ఉన్న పేద ప్రజలకు సంక్షేమ ఫలాలు అందాలని సూచించారని అన్నారు. ఆయన సిద్ధాంతాలకు అనుగుణంగా గతంలో మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వం, ప్రస్తుతం ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. వారి ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు సిరసపల్లి నూకరాజు, కృష్ణంరాజు, శంకరరావు, సోంబాబు, రోహిణి ,పావని ,మనోహర్ ,కృష్ణారెడ్డి ,లలిత ,ముసలయ్య ,మనోహర్,నాగేశ్వరరావు , రమాదేవి , రాజశేఖర్ పాల్గొన్నారు.

# సూది కొండ దిగువ ప్రాంతానికి తాగునీటి కొళాయిలు ఏర్పాటు చేయాలి

## - 85వ వార్డు ఇంచార్జ్ కార్పొరేటర్ ఇల్లపు ప్రసాద్



గాజువాక,ఫిబ్రవరి 11,ప్రభాతవార్త

రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని 85వ వార్డు ఇంచార్జ్ కార్పొరేటర్ ఇల్లపు ప్రసాద్ అన్నారు. పెదమడకలోని సూది కొండ దిగువ భాగాన్ని ఆయన సందర్శించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. సూది కొండ సాయి నగర్, పెదమడక బొర్రమాంబ కాలనీ ప్రాంతాల్లో మంచినీటి కొళాయిల లేమితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ అంశంపై ఇటీవల జీవీఎంసీ వాటర్ విభాగం ఎస్ఈను కలిసి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. సమస్యను పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. వేసవికాలంలో తాగునీటి కొరత రాకుండా తక్షణమే కొళాయిల ఏర్పాటు చేపట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ, సీనియర్ టిడిపి నాయకులు నెల్లి శ్రీనివాసరావు, బండారు చందు, రమేష్, పలక అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ సమర్పణ దివస్

గాజువాక,ఫిబ్రవరి 11,ప్రభాతవార్త

పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ సమర్పణ దివస్ భారతీయ జనతా పార్టీ మహారాణిపేట మండలం ఆధ్వర్యంలో ప్రకృతి చికిత్సలయం మహారాణి పేట ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఎస్ లక్ష్మీనారాయణ ముందుగా పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. వారు ప్రసంగిస్తూ పండిట్ జి 1968 ఫిబ్రవరి 11వ తేదీన మొగల్ సరాయి రైల్వే స్టేషన్ పరిసరాల్లో అనుమానాస్పద మృతి చెందారని మరణము దేశానికి తీరని లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ శ్రీలక్ష్మి, భారతీయ జనతా పార్టీ నేతలు రూపాకుల రవికుమార్, చొక్కాకుల రాంబాబు, దేవర చంద్రశేఖర్ రావు, టీ. గిరిజ, సుశీల, రమా, పాలూరి కృష్ణారావు, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, మచ్చ సోమేష్, పల్లా సాయి ప్రసాద్, మరగడ గౌరీ రెడ్డి, మొదలగువారు పాల్గొని ఘన నివాళులర్పించారు



# స్వచ్ఛరథం సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి..

పద్మనాభం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛరథం సేవలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన భాద్యత గ్రామ సచివాలయ సిబ్బందిదేనని ఎంపిడిఒ కె.రూపేష్ అన్నారు.బుధవారం గందవరం గ్రామంలో ఉన్న స్వచ్ఛరథం సేవలను ఆయన పరిశీలించారు. గత నెల 25 న భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ప్రారంభించిన ఈ స్వచ్ఛరథం నేటి వరకు పది గ్రామ పంచాయతీలలో పర్యటించి పుస్తకాలు, ఇనుము, ప్లాస్టిక్,గాజుగ్లాసులు తదితర వస్తువులు 1427 కేజీలను సేకరించినట్లు ఆయన అన్నారు.అలాగే ఈరథం ముఖ్య ఉద్దేశాలను వివరించారు.

# నిరుద్యోగ యువతకు అండగా సీఆర్పీఎఫ్ 198 బెటాలియన్

## ఉచిత కుట్టు శిక్షణతో 60 మందికి ఉపాధి అవకాశాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారుమూల ప్రాంతాల నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించే లక్ష్యంతో సీఆర్పీఎఫ్ 198 బెటాలియన్ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టింది. 'సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్'లో భాగంగా పాడేరు, పెదబయలు, ముంచంగి పుట్టు, అనంతగిరి మరియు డుంబ్రిగుడ ప్రాంతాలకు చెందిన 60 మంది యువతీ యువకులకు 60 రోజుల పాటు ఉచిత కుట్టు శిక్షణను విజయవంతంగా పూర్తి చేసింది. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు కేవలం నైపుణ్యాన్ని అందించడమే కాకుండా, వివిధ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలను కూడా కల్పించారు. 198 బెటాలియన్ కమాండెంట్ శ్రీ రామ్ కుమార్, సెకండ్ ఇన్ కమాండెంట్ శ్రీ సాముల కిషోర్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, నిరుద్యోగ యువత ఇలాంటి ఉచిత శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలని పిలుపునిచ్చారు.శిక్షణ ముగింపు సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అభ్యర్థులకు ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు చింతకు జగదీశ్వరరావు, జంపన శ్రీనివాసరావుతో పాటు సీఆర్పీఎఫ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. యువతకు ఉపాధి మార్గాలు చూపడంలో సీఆర్పీఎఫ్ చూపుతున్న చొరవను పలువురు అభినందిస్తున్నారు.

# రెవెన్యూ పనుల్లో అలసత్వం వద్దు!

## రికార్డుల తనిఖీలో జేసీ విద్యాధరి సీరియస్-గాజువాక తహసీల్దార్ ఆఫీసులో ఆకస్మిక తనిఖీ



గాజువాక, ఫిబ్రవరి 11 ,ప్రభాతవార్త

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి అధికారులను హెచ్చరించారు. బుధవారం ఆమె గాజువాక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ సెక్షన్లను పరిశీలించిన ఆమె, రికార్డుల నిర్వహణపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను చూసి అసహనం వ్యక్తం చేశారు. ప్రజలు తమ సమస్యల కోసం కార్యాలయాల చుట్టూ తిరగకూడదని, అందిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో రాజీ పడకూడదని, ఆక్రమణల నివారణకు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. రెవెన్యూ సేవలందించడంలో పారదర్శకత ఉండాలని, భూ సంబంధిత అంశాల్లో ఏమాత్రం అలక్ష్యం వహించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వారికి నిర్ణీత సమయంలో సేవలు అందేలా చూడాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# బాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభం

ఆరిలోవ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త



చినగదిలి నార్త్ షిరిడి సాయిబాబా సాయిబాబా ఆలయంలో బుధవారం ఆలయ వార్షికోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఉదయం సుప్రభాతసేవ, కాగడ హారతి, సామూహిక సాయి సత్యవ్రతములు జరిగాయి. సాయంత్రం పల్లకి ఉత్సవం, సేజ్ హారతి, పావళింపు సేవలు జరిగాయి. ఈ వేడుకలు గురువారం శుక్రవారం రెండు రోజులు కూడా కొనసాగుతాయని ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు వెల్లడించారు. గురువారం ఉదయం సుప్రభాతసేవ, కాగడహారతి,గురు, దైవ బాబా కు సుగంధద్రవ్యములతో, గోక్షీరముతో, అభిషేకములు, నూతన వస్త్ర, ఆభరణములు అలంకరణ ఏకహం జరుగుతాయి. మధ్యాహ్నం హారతి,సాయంత్రం పల్లకీ మహోత్సవం, సంధ్యాహారతి, రాత్రి భజన కార్యక్రమం అనంతరం బాబా కు శేజ్ హారతి ఇస్తారు.చివరి రోజు శుక్రవారం ఉదయం సుప్రభాతసేవ, కాగడ హారతి,సాయి పూజ కలశపూజ, 12 గంటలకు గురుబాబా వారికి అన్నాభిషేశీ, మధ్యాహ్నం హారతి,భక్తులకు మహా అన్నప్రసాద వితరణ, సాయి సుహృత హోమం, పూర్ణాహుతి రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, సాయి నామ సంకీర్తణ, భజన కార్యక్రమం, నక్షత్ర హారతి, శేజ్ హారతి,పవళింపు సేవ, తీర్ధ ప్రసాద వేడుకలు జరుగుతాయి. ముగింపు రోజు శుక్రవారం పెద్ద ఎత్తున అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. చినగదిలి పరిసర ప్రాంత ప్రజలందరూ ఈ వేడుకల్లో పాల్గొనవలసిందిగా ఆయన కోరారు.

# హిట్ అండ్ రన్ బాధిత కుటుంబానికి రూ.1.50 లక్షల ఆర్థిక సాయం



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

విశాఖపట్నం సిటీ కమిషనరేట్ పరిధిలో రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా మరో కుటుంబానికి ఆర్థిక సహాయం అందింది. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆధ్వర్యంలో బుధవారం బాధిత కుటుంబానికి రూ. 1.50 లక్షల చెక్కును అందజేశారు. 2019 నవంబర్‌లో ఎయిర్‌పోర్ట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఒక కేసులో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో గంటి వెంకట నాగ సాయి రామ దిలీప్ కుమార్ (27), ఎంబీఏ, మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే సాంకేతిక కారణాల వల్ల ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారం అందలేదు.ఈ నేపథ్యంలో బాధిత కుటుంబం పోలీస్ కమిషనర్‌ను సంప్రదించగా, ఆయన విజ్ఞప్తి మేరకు కృష్ణ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ అధినేత కపిల్ సింగ్ రూ. 1,00,000, విశాఖ సేఫ్టీ కౌన్సిల్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ అధినేత బాల సతీష్ రూ. 50,000 ఆర్థిక సహాయం అందించారు. మొత్తం రూ. 1,50,000ను మృతుని తల్లిదండ్రులు గంటి పద్మజ, గంటి వెంకట సూర్యనారాయణ మూర్తి (విజయనగరం, పద్మావతి నగర్)లకు కమిషనర్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా సహాయం చేసిన దాతలను పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు. కాగా, 08-12-2024న ప్రారంభించిన రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా ఇప్పటివరకు 114 మందికి రూ. 96 లక్షల పరిహారం అందించినట్లు సీపీ బాగ్చి తెలిపారు. హిట్ అండ్ రన్ కేసుల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ. 50 వేల వరకు జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ ద్వారా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

# దేశాభివృద్ధికి పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ తీవ్ర కృషి

ఆనందపురం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:



దేశాభివృద్ధికి, సామాజిక సమగ్రతకు పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ తీవ్రంగా కృషి చేశారని రాష్ట్ర మెడికల్ సెల్ కన్వీనర్ రూపాకుల రవి కుమార్ చెప్పారు. బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ అప్పారావు ఆధ్వర్యంలో పెద్దిపాలెంలో పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, పార్టీ కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రూపాకుల రవి కుమార్ కుమార్ మాట్లాడుతూ దేశానికి దీన్ దయాల్ చేసిన సేవలను, సమగ్ర మానవతావాదం సిద్ధాంతాలను వివరించారు. ఆయన ఆశయాలను యువత అనుసరించి దేశ ప్రగతికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ మీసాల రామానాయుడు, కిసాన్ మోర్చ అధ్యక్షులు రెడ్డిపల్లి శ్రీనివాస్ రావు, మండల ప్రధాన కార్యదర్శి పోతిన జీవన్ సంతోష్ , అద్దురి సురేష్, ఉప్పాడ శివ, నిమ్మకాయల అప్పల రాజు, పాల్లూరి కృష్ణ రావు, గౌరి రెడ్డి పాల్గొన్నారు.

# కేన్సర్ బారిన పడిన విద్యార్థికి ఆర్థిక సాయం

## పెద్ద మనసు చాటుకున్న దాతలు

ఆనందపురం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:



కేన్సర్ బారిన పడి ఆర్థిక ఇబ్బందులతో ఆదుకునే వారికోసం ఎదురు చూస్తున్న విద్యార్థికి ఉపాధ్యాయులతో పాటు పలువురు దాతలు ఆర్థిక సాయం చేసి తమ గొప్ప మనసును చాటుకున్నారు. పద్మనాభం మండలం గంధవరం గ్రామానికి చెందిన నానిగిరి సత్యనారాయణ కొన్నేళ్ళ క్రితం భార్య, వారి కుమారుడు చరణ్, మరో బిడ్డతో కలసి బతుకు తెరువు కోసం ఆనందపురం వలస వచ్చి కూలిపని చేసుకుంటూ జీవించేవారు. చరణ్ ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఏడాది క్రితం గొంతు కేన్సర్ తోతండ్రి సత్యనారాయణ మరణించగా నెల రోజుల క్రితం అనారోగ్యంతో బాధపడుతున్న చరణ్ కు వైద్య పరీక్షలు చేయించగా ఎముకల కేన్సర్ అని తేలింది. వైద్యం కోసం లక్షల రూపాయలు అవసరమని వైద్యులు తెలిపారు. దీంతో దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్న విషయం పాఠశాలలో తెలిసి పాఠశాల ఇంగ్లీష్ ఉపాధ్యాయిని శ్రీవిద్య హెచ్ ఎమ్ కామేశ్వరరావు స్పందించి ఉపాధ్యాయులు, వారి బంధువులు, మిత్రులు, విద్యార్థులు, తల్లిదండ్రుల ద్వారా చికిత్స నిమిత్తం మొత్తం రూ. 1,85,000 ను సేకరించి పాఠశాల హెచ్ ఎం కామేశ్వరరావు, పాఠశాల ఎక్స్ అఫీషియో మెంబర్ సత్యమూర్తి చేతుల మీదుగా బాధితుడు తల్లి లక్ష్మి కి అందజేశారు. దీంతో వారు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు మరింత సాయం చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



# అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య

ఆనందపురం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:

మండలంలోని లొడగలవాని పాలెం పంచాయితీ నేల్తేరు గ్రామంలో అనారోగ్యంతో ఓ వివాహిత పురుగులు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాండ్రంకి లీల (45) అనే వివాహిత గత ఏడేళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతోంది. ఇదిలా ఉండగా మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉన్న గడ్డి మందును లీల తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం తెలుసుకున్న భర్త శ్రీనివాసరావు చికిత్స కోసం కేజీహెచ్ కు తరలించగా ఆమె చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఎస్ ఐ పందిరి శివ కేసు నమోదు చేయగా హెచ్ సి గౌరీశ్వరమ్మ దర్యాప్తు చేస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో కార్మికుడుకు తీవ్ర గాయాలు

ఆనందపురం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:



ఆనందపురం మండలంలోని సొంట్యాం వద్ద జాతీయ రహదారి పై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రోడ్డు పనులు చేస్తున్న కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనలో తన ఎడమ కాలును పోగొట్టుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా బోగాపురం ఎస్సీ కాలనీకి చెందిన నిడిగట్టు పైడిరాజు (60) జాతీయ రహదారి పై ఉన్న మొక్కలకు నీరుపెట్టే పనులను చేస్తున్నాడు. బుధవారం సొంట్యాం దగ్గర బ్రిడ్జి వద్ద ట్యాంకర్ ను నిలిపి మొక్కలకు నీరు పోస్తున్నాడు. ఈ లోగా ఆపి ఉన్న ట్యాంకర్ ను లారీ వెనుక వైపు నుంచి ఢీ కొనడంతో ట్యాంకర్ కదిలి పైడిరాజును ఢీకొని దూసుకు పోయింది. ఈ సంఘటనలో పైడిరాజు ఎడమకాలు మడం వరకూ విరిగిపోయి వేరుపడింది. ఈ మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# డిజిటల్ అరెస్ట్' పేరిట రూ.66 లక్షల మోసం - గ్యాంగ్ సభ్యుడి అరెస్టు



(విశాఖ క్రైమ్ - ప్రభాతవార్త)

'డిజిటల్ అరెస్ట్' పేరిట వృద్ధుడిని బెదిరించి రూ. 66 లక్షలు కాజేసిన ముఠాలో ఒకరిని విశాఖ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్టు చేశారు. నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి పర్యవేక్షణలో జరిగిన దర్యాప్తులో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జిల్లాకు చెందిన ఓ రిటైర్డ్ ఉద్యోగికి అపరిచితుడు వాట్సాప్ కాల్ చేసి, తాను 'డిపాజిటర్స్ ప్రొటెక్షన్ బోర్డ్, ముంబై' అధ్యక్షుడినని చెప్పాడు. అనంతరం కాల్‌ను 'మహారాష్ట్ర పోలీస్ డీఐజీ వికాస్ శర్మ'గా పరిచయం చేసుకున్న మరో వ్యక్తికి బదిలీ చేశారు. బాధితుడి పేరుతో కెనరా బ్యాంకులో ఖాతా తెరిచి, దాని ద్వారా కోట్ల రూపాయల మనీ లాండరింగ్ జరిగిందని, సుప్రీంకోర్టు అరెస్ట్ వారెంట్ జారీ చేసిందని బెదిరించారు.దర్యాప్తు పేరుతో ఐదు రోజుల పాటు ఎవరితోనూ మాట్లాడవద్దని, నిరంతరం వీడియో కాల్‌లో ఉండాలని ఒత్తిడి తెచ్చి తీవ్ర మానసిక భయాందోళనలకు గురిచేశారు. అనంతరం రూ. 66 లక్షలను వివిధ మ్యూల్ బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేయించుకుని మోసగించారు.కేసు దర్యాప్తులో భాగంగా డబ్బులను వేగంగా వివిధ ఖాతాలకు మళ్లించి ఉపసంహరించుకునే ముంబై గ్యాంగ్‌తో కలిసి పనిచేసిన గుంటూరుకు చెందిన చాగంటి గౌతమ్ (40)ను పోలీసులు అరెస్టు చేశారు. కమిషన్ కోసం ఫర్మ్ పేరిట మ్యూల్ బ్యాంకు ఖాతా తెరిచి, ముంబైలో లావాదేవీలు నిర్వహించినట్లు గుర్తించారు. అతని ఖాతా ద్వారా సుమారు రూ. 5 కోట్ల మేర లావాదేవీలు జరిగినట్లు పోలీసులు వెల్లడించారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి: సీపీ శంఖబ్రత బాగ్చి

అపరిచిత నంబర్ల నుంచి డిజిటల్ అరెస్ట్, మీ పేరిట కొరియర్ అంటూ కాల్స్ వస్తే నమ్మవద్దనీ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి హెచ్చరించారు. పార్సెల్‌లో మాదకద్రవ్యాలు ఉన్నాయంటూ, ఆన్‌లైన్ దర్యాప్తు పేరుతో వీడియో కాల్ చేయమంటే స్పందించవద్దన్నారు. మనీ లాండరింగ్ పేరుతో ఆర్బీఐ వెరిఫికేషన్ అంటూ డబ్బులు బదిలీ చేయమంటే చేయవద్దున్నారు. మోసానికి గురైతే వెంటనే 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే సీపీ ప్రత్యేకనంబర్ 7995095799కు సమాచారం అందించాలని సూచించారు.

# ఉద్యోగ రూపకర్తలుగా సీఎంటీ విద్యార్థులు చరిత్ర సృష్టించాలి

## రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవో రవి ఈశ్వరపు

(విశాఖపట్నం - ప్రభాతవార్త)



పీఎంపాలెంలోని సీఎంటీ బిజినెస్ స్కూల్ 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ' (ఆర్‌టీఐహెచ్) ఆధ్వర్యంలో విద్యార్థుల్లో ఆవిష్కరణా దృక్పథం, వ్యాపార ఆలోచన, స్టార్టప్ సంస్కృతిని ప్రోత్సహించేందుకు ఐదు రోజుల పాటు 'స్పార్క్ ' అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమం ఈ నెల 14వరకు కొనసాగనున్నట్టు నిర్వాహకు లు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నిపుణుల ఉపన్యాసాలు, ప్రాక్టికల్ శిక్షణ, స్టార్టప్ ఎకోసిస్టం పై ప్రత్యక్ష అవగాహన కల్పించే కార్యక్రమాలుంటాయని సీఎంటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ దీపిక దాస్ స్పష్టం చేశారు. తొలిరోజు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ సీఈవో రవి ఈశ్వ రపు హాజరై మాట్లాడారు. సీఎంటీ విద్యార్థులు ఉద్యోగ రూపకర్తలుగా ఎదిగి చరిత్ర సృష్టించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో స్టార్టప్స్, వ్యవస్థాపకత ప్రాధాన్యత పెరుగుతోందని, సంప్రదాయ ఉద్యోగాలకే పరిమితం కాకుండా విద్యార్థులు వ్యాపార రంగాన్ని కూడా కెరీర్‌గా పరిశీలించాలని తద్వారా ఆవిష్కరణ, ఉపాధి అవకాశాలతో తమ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని సూచించారు.

### డేటా సెంటర్‌కు తీసుకు వెళ్తాం..

వర్క్‌షాప్ చివరి రోజున విద్యార్థుల్ని ఆర్‌టీఐహెచ్ డేటా సెంటర్‌కు తీసుకు వెళ్లి, వారు తమ వ్యాపార ఆలోచనల్ని ప్రదర్శించే అవకాశముంటుందని రవి తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్ని ఫ్యూచర్ ఫౌండర్స్‌గా గుర్తించి, వారి ఆవిష్కరణాత్మక ఆలోచనలకు ఆర్‌టీఐహెచ్ నుంచి పూర్తి ఆర్థిక సాయం అందజేసి, విజయవంతమైన స్టార్టప్‌లుగా రూపుదిద్దుకునే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. కార్యక్రమానికి సీఎంటీ ఈడీ దీపికా దాస్, రీడ్ ఇన్స్టిట్యూషన్స్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ కృష్ణ మోహన్, డైరెక్టర్ డాక్టర్ అర్చన, గెస్ట్ ఆఫ్ హానర్, ఆల్కోవ్ పార్ట్‌నర్స్ సంస్థ సహ వ్యవస్థాపకుడు కిరణ్ కొరివి, ట్రాన్స్‌ఫార్మిక్స్ సంస్థ వ్యవస్థాపకులు, సీఈవో ఇంతియాజ్ అర్షాద్ తదితరులు హాజరయ్యారు.

# బి.సి.వై. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా అల్లు రమణ యాదవ్ నియామకం

గాజువాక,ఫిబ్రవరి 11,ప్రభాతవార్త



భారత చైతన్య యువజన పార్టీ (బి.సి.వై.పి) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఎగ్జిక్యూటివ్ సభ్యునిగా విశాఖపట్నం గాజువాక ప్రాంతానికి చెందిన సీనియర్ రాజకీయ నేత అల్లు రమణ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీ చేసింది. గత మూడు దశాబ్దాలుగా ఉమ్మడి విశాఖ జిల్లా రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న రమణ యాదవ్ సేవలను గుర్తించి పార్టీ ఈ బాధ్యతను అప్పగించింది. 1992లో గాజువాక బీసీ సెల్ కాంగ్రెస్ ప్రచార కార్యదర్శిగా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, ఆ తర్వాత రాష్ట్రీయ జనతాదళ్ లో జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. 1998లో ఆయన సామాజిక సేవకు గుర్తింపుగా 'రాష్ట్ర యువశక్తి' అవార్డును అందుకున్నారు.నియామకం అనంతరం అల్లు రమణ యాదవ్ మాట్లాడుతూ "బీసీల అభ్యున్నతే లక్ష్యంగా స్థాపించబడిన బి.సి.వై పార్టీలో తనకు కీలక బాధ్యత అప్పగించినందుకు పార్టీ అధినేత రామచంద్ర యాదవ్‌కి కృతజ్ఞతలు" తెలిపారు. రాష్ట్రం లో బడుగు బలహీన వర్గాల గొంతుకగా నిలిచి, పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆయన అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కూడా బాధ్య తలు నిర్వహిస్తున్నారు. రమణ యాదవ్ నియామకం పట్ల బీసీ నాయకులు, పార్టీ కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

vsp - 11_vsp - 11.qxd 2/11/2026 11:33 PM Page 1






## నేడే విజయరామరాజుపేట మరిడిమాంబ జాతర

**అనకాపల్లి రూరల్ ఫిబ్రవరి 11 (ప్రభాత వార్త):**



స్థానిక విజయరామరాజుపేట గ్రామంలో కొలువైయున్న 119 ఏళ్ల చరిత్ర కలిగిన గ్రామదేవత శ్రీ మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరగనుంది. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గ్రామ పురవీధుల్లో భారీ విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి పలువురు ప్రజా ప్రతినిధులు నాయకులు హాజరుకానున్నారని గ్రామ కమిటీ, ఉత్సవ కమిటీ చైర్మన్ ఆళ్ల శివరామ సత్యనారాయణ తెలిపారు. సాయంత్రం అమ్మవారి జాతరలో పలు నేలవేషాలు, కోలాట ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఏటా ఫిబ్రవరి నెలలో జరిగే అమ్మవారి జాతరకు వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కలు చెల్లించుకుంటారని కమిటీ సభ్యులు తెలిపారు

## 12 న వేంపాడు సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం..

**(నక్కపల్లి: ప్రభాతవార్త)**

మండలంలోని వేంపాడు సబ్స్టేషన్ పరిధిలో కోసం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సౌకర్యానికి అంతరాయం కలుగుతుందని విద్యుత్ సిబ్బంది బుధవారం ప్రకటనలో తెలిపారు. వేంపాడు తో పాటు నెల్లిపూడి ,డిఎల్ పురం, అమలాపురం ,గుల్లిపాడు, రేబాకా, చిన్న దొడ్డి గళ్ళు ,దొంకాడ ,చీడిక, దోసలపాడు ,జి జే పురం, గ్రామాలకు విద్యుత్ కు అంతరాయం ఉంటుందని ఆ ప్రకటనలో ఈఈ రాజశేఖర్ తెలిపారు. వ్యవసాయ రైతులకు ఉదయం 5 గంటల నుంచి ఏడు గంటల వరకు 11 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు త్రీఫేస్ కరెంటు సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు .

## గ్రామంలో సిసి రోడ్ నిర్మాణం.!



**(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)**

మండలంలోని రాజయ్యపేట శివారు బోయపాడు గ్రామంలో ఎస్ ఆర్ ఆర్ కంపెనీ యాజమాన్యం ముందుకొచ్చి ప్రాజెక్టు మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో సిసి రోడ్ నిర్మాణాలు చేపట్టారు. గ్రామ సమస్యలు తెలుసుకుని సిసి రోడ్ నిర్మాణాలకు ముందుకు వచ్చిన ఎస్ ఆర్ ఆర్ యాజమాన్యానికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

## నూకతాత గుడి చుట్టూ తుప్పలు తొలగింపు

**(నక్కపల్లి ,ప్రభాతవార్త)**



మండలంలోని రాజయ్యపేట గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రతిష్టాత్మక నిర్వహించే శ్రీ నూకతాత జాతర మహోత్సవ సందర్భంగా గుడి చుట్టుపక్కల ప్రాంగణంలో తుప్పలు ఎక్కువగా ఉండటంతో గ్రామస్తులతోపాటు జనసేన నాయకులు పిక్కి స్వామి ఎస్ ఆర్ ఆర్ ప్రాజెక్ట్ రమేష్ తక్షణమే స్పందించి గుడి చుట్టూ తుప్పలు ప్రత్యేక జెసిబితో తొలగించారు. ఎస్ఆర్ఆర్ ప్రాజెక్ట్ మేనేజర్ రమేష్ స్పం దించిన పట్ల రాజయ్యపేట గ్రామప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## సీఈవో ,డిప్యూటీ సీఈవోలను కలిసిన టిఆర్ మినిస్టీరియల్ అసోసియేషన్ జిల్లా నాయకత్వం!

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**





ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతి రాజ్ మినిస్ట్రీ రియల్ ఎన్నికలు పూర్తయిన సందర్భంగా జిల్లా నూతన నాయకత్వం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్. సత్తిబాబు, దెందుకూరు సీతారామరాజులు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సీ ఈ ఓ పి .నారాయణమూర్తి, డిప్యూటీ సీఈవో రాజకుమార్ లను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బందికి నాల్గవ తరగతి సిబ్బందికి రావలసిన సమ్మర్ సెలవులలో పనిచేసినందుకు ఆర్జిత సెలవు ప్రస్తావించగా, అందరు ప్రధానో పాధ్యాయులకు తగు సూచనలు గతంలో ఇవ్వడం జరిగిందని, మరియొక పర్యాయం ఇవ్వడం జరుగుతుందని తెలియచేసారు. బుచ్చయ్యపేట పరిపాలనధికారులకు ఇతర సర్వీస్ కు వెళ్ళడానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరాగా సానుకూలంగా స్పందిస్తూ త్వరలో ఇస్తామని,రికార్డు అసిస్టెంట్ నుండి జూనియర్ లు కూడా వారం, పది రోజుల్లో ఇవ్వడం జరిగితుందని తెలియ చేశారు. కలసిన వారిలో జిల్లా కోశాధికారి సుధారాణి, ఉపాధ్యక్షులు శ్రీనివాసు, జడ్పీ పరిపాలన్నాధికారి నర్ససింహ మూర్తి,మన్మోహన్, వినోద్, నాగేశ్వరరావు, చిట్టిబాబు తదితరులు ఉన్నారు .

## హెల్మెట్ ప్రాధాన్యంపై అవగాహన కల్పించిన డి.ఎస్.పి

**(రాంబిల్లి ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త)**



రాంబిల్లి మండలం వెంకటాపురం కూడలిలో డి.ఎస్.పి విష్ణు స్వరూప్ తనిఖీలు నిర్వహించి వాహనదారులకు హెల్మెట్ పై అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని, ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం గమనించిన డి.ఎస్.పి హెల్మెట్ ప్రాణారక్షక సాధనమని, ప్రమాదం సంభవించినప్పుడు తలకు తీవ్రమైన గాయాలు కాకుండా రక్షించడంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు, ఎ రోడ్ల భద్రతపై ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు, ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ సిహెచ్. నర్సింగరావు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నేరాల నియంత్రానికి సహకరించండి: ఎస్పై "సాహిబా అంజుమ్"

**(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)**



గ్రామాల్లో నేరాల నియంత్రణకు యువకులు సహకరించాలని ఎస్పై సాహిబా అంజుమ్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని రాజయ్యపేట గ్రామంలో సిఐ జూ రెడ్డి మురళి ఆధ్వర్యంలో స్క్రీన్ పై నేరాలు నియంత్రణపై ఏ విధంగా వ్యవహరించాలి, ఎటువంటి చర్యలు చేపట్టాలి అనే విషయంపై అవగాహన కల్పించారు. ఆలయాల వద్ద భద్రత క్రికెట్టు బెట్టింగులు, అకౌంట్ మోసాలు, ఆన్లైన్ మోసాలపై ఏ విధంగా వ్యవహరించాలి, ప్రధానంగా గంజాయి అక్రమ రవాణా వంటి విషయాలు పూర్తిస్థాయిలో వివరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకూడదని, తాగితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. హెల్మెట్ లేకుండా గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులపై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎంపీటీసీ పిక్కి సత్తయ్య ,గ్రామ శాఖ అధ్యక్షులు గంగరాజు ,ఎజ్జల లోవరాజు, నగేష్ ,వెంకటేష్, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పథకాలు పొందాలి అంటే రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**(నక్కపల్లి/ అడ్డు రోడ్డు/ ప్రభాతవార్త)**

మండలం లో పి ఎం కిసాన్ లబ్ధిదారులు 8158 గాను సుమారు 1977 మంది రైతులు ఇంకా ఫార్మర్ రిజిస్ట్రీ లో నమోదు కాలేదని తక్షణమే రైతులు విడతల వారీగా లబ్ధి పొందాలి అంటే ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ కోరారు. ఈ సందర్భంగా ఆర్ ఎస్ కే సిబ్బంది అందరికి రైతుల వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు.

# రెవెన్యూ శాఖ పనులను సకాలంలో పూర్తి చేయాలి: కలెక్టర్ విజయకృష్ణ

**అనకాపల్లి, ఫిబ్రవరి 11 (ప్రభాత వార్త):**



రెవిన్యూ శాఖ అంశాలకు సంబంధించిన పనులను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తహశీల్దార్లను ఆదేశించారు. బుధవారం కలెక్టరు కార్యాలయం నుండి తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స నిర్వహించి పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ, పి.జి.ఆర్.ఎస్ , రెవిన్యూ క్లినిక్, మ్యుటేషన్లు, రీసర్వే, రీసర్వే రీ వెరిఫికేషను, ఎం.ఎల్.సి.సి., బూత్ లెవల్ సమావేశాలు, ప్రభుత్వ భూములు పరిరక్షణ, ఇంటివద్దకే రేషను పంపిణీ, రేషను దుకాణాలు తనిఖీ, అనుమతులు మంజూరు తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షా సమావేశం నిర్వహించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మాట్లాడుతూ ప్రతి సోమవారం పి.జి.ఆర్.ఎస్. , రెవిన్యూ క్లినిక్ కార్యక్రమాల ద్వారా వచ్చిన ధరఖాస్తులపై మరుసటిరోజునే క్షేత్ర స్థాయి సందర్శన నిర్వహించి, సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని, పరిష్కారం కాని సమస్య అయితే అర్జీదారునికి వెంటనే తెలియజేయాలని, ఎండార్సు మెంటు కాపీని అర్జీదారునికి అందించాలని తెలిపారు. రెండవ విడతలో రీసర్వే జరిగిన గ్రామాలలో మరల క్షేత్ర పరిశీలనచేసి, రికార్డులు పరిశీలించి, తప్పులను సరిదిద్ది, ఎటువంటి తప్పులు లేకుండా పాసుపుస్తకాలు ముద్రణకు పంపించాలన్నారు. రీ వెరిఫికేషను తరువాత పిర్యాదులు వస్తే సంబంధింత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నీటి తీరువా నూరు శాతం వసూలు చేయాలని, వసూలుకాని గ్రామాలలో రైతులకు విషయం తెలియజేసి, వసూలు చేయాలన్నారు. ఎన్నికలకు సంబంధించి ప్రతివారం బూత్ లెవల్ అధికారులతో సమావేశం నిర్వహించాలని, ఎప్పటికప్పుడు కొత్త ఓటర్లు నమోదు, మరణించిన, వలసవెళ్లిన వారి ఓట్లు తొలగింపు చేసి శుద్దమైన ఓటరు లిస్టు తయారుచేయాలన్నారు. సివిల్ సప్లయి కి సంబంధించి ఇంటివద్దకే రేషను సరుకులు పంపిణీ నిర్ణీత గడువులోపునే నూరుశాతం పూర్తిచేయాలని ఆదేశించారు. తహశీల్దార్లు లక్ష్యం మేరకు రేషను డిపోలు తనిఖీలు నిర్వహించి రిపోర్టు పంపిచాలని తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి వై. సత్యనారాయణరావు, సర్వే శాఖ సహాయ సంచాలకులు ఎస్. గోపాల్ రాజా, డిఎస్ఓ కె.వి.ఎల్.ఎన్.మూర్తి, కలెక్టరు కార్యాలయ సూపరింటెండెంట్ లు, తహశీల్దార్లు హాజరయ్యారు

## స్మశాన స్థలం కబ్జా కాకుండా నియంత్రించాలి.. గ్రామ పెద్దలు వినతి.!

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



మండలంలోని దేవవరం పంచాయతీ పరిధిలో పద్మశాలీలకు కేటాయించిన స్మశాన స్థలం కబ్జాకు గురవుతుందని తక్షణమే నియంత్రించాలని కోరుతూ ఉప తాసిల్దార్ నారాయణరావుకు ఆ గ్రామానికి చెందిన పెద్దలు బుధవారం వినతి పత్రం అందజేశారు. సర్పంచ్ భర్త, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు గొర్ల నరసింహమూర్తి, మాజీ ఎంపిటిసి దండు బలరామరాజు, గ్రామ పెద్ద అంగరాజు రాము తో పాటు ఈసంపల్లి రామస్వామి, వెంకటరమణ ,బుజ్జి, వరహాలు, సత్యనారాయణ పలువురు వినతి పత్రం అందజేశారు. పూర్వం నుంచి ఈ భూమి స్మశానానికి కేటాయించడం జరిగిందని అటువంటిది భూమి చుట్టూ ఫెన్సింగ్ వేస్తున్నారని తక్షణమే ఆ కబ్జాకు పాల్పడిన వారిపై చర్య తీసుకోవాలని కోరారు. స్పందించిన ఉప తాసిల్దార్ విఆర్ఓ కు నివేదిక అందజేయమని ఆదేశించారు.

## పదవ తరగతి విద్యార్థుల ప్రణాళికను పరిశీలించిన డీఈవో

**(రాంబిల్లి ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త)**



రాంబిల్లి మండలం దిమిలి గ్రామంలో ఉన్న శ్రీ భాగవతుల సోమన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు సందర్శించారు, ఈ సందర్భంగా పదవ తరగతి 100 రోజుల కార్యచరణ ప్రణాళిక ను పరిశీలించారు, విద్యార్థుల హాజరు, ప్రత్యేక పునరావృత తరగతులు, అధ్యాపకుల బోధన విధానాలపై సమీక్ష నిర్వహించారు, ఉపాధ్యాయులకు అవసరమైన సూచనలు ఇచ్చారు, ప్రతి విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు, చదువులో వెనుకబడి ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివించాలని కోరారు, విద్యార్థులతో మాట్లాడి వారి సందేహాలను అడిగి తెలుసుకుని పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరచాలని ప్రోత్సహించారు, మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా ఆరగించి పరిశీలించారు, ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాస్టారు, ప్రధానోపాధ్యాయులు శాస్త్రి, అప్పలనాయుడు, ఉపాధ్యాయులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## నగరవనం ఏర్పాటు పనులపై రేంజ్ అధికారి పరిశీల న

**గొలుగొండ ఫిబ్రవరి 11 ప్రభాతవార్త**



నర్సీపట్నం డివిజన్ పరిధిలో ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో నగరవణంగా రూపుదిద్దుకుంటున్న ప్రాంతాన్ని నర్సీపట్నంలో రేంజ్ అధికారి రాజేష్ పరిశీలించారు. గతంలో ధన్వంత్రి వనముగా ఉన్న ఆరిల్లోవ ప్లాంటేషన్ను నగరవణంగా మార్చేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గత రెండు నెలలుగా నగరవనంకి అనువైన విధంగా రూపుదిద్దుకునేందుకు ప్రాథమిక దశ పనులు జరుగుతున్నాయి. ఎప్పటికే సగానికి పైగా ప్రాంతాన్ని జంగిల్ క్లీనింగ్ నిర్వహించి శుభ్రం చేశారు. ఈ మధ్యనే రెండు బోర్లు నిర్మాణం కూడా చేసినట్లు రేంజ్ అధికారి తెలిపారు. నగరవణంగా రూపుదిద్దే ప్రాంతం మొత్తం రోడ్లు ఏర్పాటుకు పరిశీలించేందుకు వచ్చినట్లుగా తెలిపారు. త్వరలోనే ఉన్నతాధికారులు పర్యటన ఉందని అప్పటికి ప్రధాన రహదారిని ఆధునికరించే దుకు పరిశీలించారు. మరో నాలుగు రోడ్లు కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు. వీటితోపాటు ట్రాక్ బ్రిడ్జిలు నిర్మాణం కూడా జరుగుతుందని అన్నారు. రేంజ్ అధికారి వెంట సెక్షన్ అధికారి రామానుజులు, ఎఫ్ బి ఓ సహాయ సిబ్బంది పాల్గొన్నారు.

## పండిత్ దీన్ దయాలకు ఘనంగా నివాళులు.!

**(నక్కపల్లి, ప్రభాతవార్త)**



పండిట్ దీన్ దయాల్ వర్ధంతి కార్యక్రమం బిజెపి మండల పార్టీ అధ్యక్షులు పోలినాటి నానాజీ ఆధ్వర్యంలో బుధవారం పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రాష్ట్ర కిషన్ మోర్చా ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవి రాజు, రాష్ట్ర కిషన్ మోర్చా సభ్యులు డాక్టర్ రత్న భరత్ , జిల్లా కార్యవర్గ సభ్యులు కోసూరి శ్రీను, జిల్లా కార్యవర్గ సభ్యులు దాడిశెట్టి ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి నానాజీ, కిషన్ మోర్చా కార్యదర్శి షేక్ ఇమామ్, హుస్సేన్, బుద్దాల నాగమణి, జిల్లా ఉపాధ్యక్షురాలు సీనియర్ నాయకులు ఈగల వెంకటేశ్వరరావు, ఈగల త్రినాధమ్మ, తుమ్మల కుమారి, కొల్నాటి అప్పారావు, నాగన బోయిన సూరిబాబు ,బంగారు శివ,అమ్మోరియా, దొండవాక రామకృష్ణ, వేముల వెంకటరమణ తదితరులు పూలమాలవేసి నివాళులర్పించారు.

## మంత్రి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసిన ప్రగడ

**ఎలమంచిలి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎం ఎస్ ఎం ఈ, ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అమరావతి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక యువతకు, నిరుద్యోగులకు పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. నియోజకవర్గం అచ్యుతాపురంలో ఎంఎస్ఎంఈ పార్కులో ఔత్సాయక యువ పారిశ్రామికవేత్తలకు భూములు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామినేని రమేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు. మంత్రి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసిన ప్రగడ నాగేశ్వరరావు.... ఎలమంచిలి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎం ఎస్ ఎం ఈ, ఎన్ఆర్ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు ని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ ప్రగడ నాగేశ్వరరావు అమరావతి సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానిక యువతకు, నిరుద్యోగులకు పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పించాలని అన్నారు. నియోజకవర్గం అచ్యుతాపురంలో ఎంఎస్ఎంఈ పార్కులో ఔత్సాయక యువ పారిశ్రామికవేత్తలకు భూములు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామినేని రమేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం పాలన

**- మాజీ ఎంపీ పప్పల చలపతిరావు**

**ఎలమంచిలి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**




ప్రజా సంక్షేమం దిశగా కూటమి ప్రభుత్వం పాలన జరుగుతోందని మాజీ ఎంపీ పప్పల చలపతిరావు అన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సీనియర్ తెలుగుదేశం నాయకులు, మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు పత్రిక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పప్పల చలపతిరావు మాట్లాడుతూ 20 నెలల పాలనలో కూటమి ప్రభుత్వం అనేక విజయాలు సాధించిందని, సంక్షేమం, అభివృద్ధి, సుపరి పాలనతో రాష్ట్ర పునర్నిర్మాణం కోసం అనునిత్యం పనిచేస్తుందని అన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ పునరుద్ధరణతో ప్రజల ఆశలు నెరవేర్చుతూ... స్వర్ణాంధ్రకు బాటలు వేస్తుందని అని అన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయిందని, తల్లికి వందనం పథకం కింద 10,090 కోట్ల రూపాయలు తల్లుల ఖాతాలో 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం చేసిందని, స్త్రీ శక్తి పథకం కింద 5 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించారని అన్నారు. దీపం 2 పథకం కింద ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు అందిస్తున్నామని, ఇప్పటివరకు 3.64 కోట్లు సిలిండర్లు అందజేశామని, అన్నదాత సుఖీభవ పథకం కింద 46 లక్షల మంది రైతులకు రెండు విడతల్లో 6,310 కోట్ల రూపాయలు జమ చేశామని, ఎన్టీఆర్ భరోసా పథకం కింద ప్రతినెల 63 లక్షల మందికి పెన్సిల్ అందిస్తున్నామని, ఇప్పటికీ 58,654 కోట్ల రూపాయలు వెచ్చించామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1000 కోట్ల రూపాయలతో రోడ్లు మరమ్మత్తులు, పల్లె పండగ ద్వారా గ్రామాలలో 4000 కిలోమీటర్లు రోడ్డు నిర్మాణం చేశామని తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులకు ఈ 20 నెలలో 23,790 కోట్లు ఖర్చు చేశామని, పోలవరం నిర్మాణం అవుతుందని, ఇది మంచి ప్రభుత్వం అని, స్వర్ణాంధ సాధించే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గొర్లె శివన్నారాయణ మూర్తి, ఇత్తంశెట్టి రాజా వెంకట రమణ, జిల్లా అధికార ప్రతినిధి దాడి రమేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ గొర్లి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## చిత్రలేఖనంలో గవరవరం విద్యార్థులకు బంగారు పథకాలు

**చోడవరం, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**



చోడవరం మండలం గవరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలో బంగారు పతకాలు సాధించారు చోడవరం చిత్రకళ నిలయం వ్యవస్థాపకులు బొడ్డేడ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీలలో 8 మంది బాలబాలికలకు బంగారు పథకాలు సాధించారు వీటితోపాటు నగదు బహుమతి ప్రశంసా పత్రాలను అందజేశారు ఈ సందర్భంగా చిత్రలేఖనం ఉపాధ్యాయులు ఎన్ నాగరాజును బొడ్డేడ సూర్యనారాయణ, సబ్ రిజిస్టర్ గీతాలక్ష్మి, ఆర్కే సీఈవో ప్రసాద్, ప్రకాష్, ప్రేమ సమాజం రాజు ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుందర్ సింగ్, మండల విద్యాశాఖ అధికారి పాండురంగారావు, సింహాచలం పాల్గొని అభినందించారు.

# అట్టహాసంగా దివ్యాంగుల రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం







**(నక్కపల్లి ,ప్రభాతవార్త)**

పారా వాలీబాల్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారి ఆధ్వర్యంలో విశాఖపట్నం సమీపంలో గోపాల పట్నం బి ఎస్ ఏ ఇండోర్ స్టేడియంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర దివ్యాంగుల(వికలాంగుల) సిట్టింగ్ వాలీబాల్ 5వ రాష్ట్రస్థాయి పోటీలు పలువురు ప్రముఖులు సమక్షం లో అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఈ పోటీలు పారా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు బోడపాటి శివదత్ నాయకత్వం లో ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి పెందుర్తి శాసన సభ్యులు పంచకర్ల రమేష్ బాబు, రాష్ట్ర ఎం ఎస్ ఎం ఈ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకర్ , రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రాష్ట్ర అధ్యక్షులు గోనుగుంట్ల కోటీశ్వరరావు , ఏసీ ఈ ప్రొఫెసర్ కందుల హనుమంత రావు, ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ చైర్మన్ వన్నెంరెడ్డి సతీష్ కుమార్, విశాఖ పడమర జనసేన నాయకులు, బెహరా గ్రూప్ చైర్మన్ బెహరా భాస్కర రావు , ప్రో కబడ్డీ సీఈవో తెలుగు టైటాన్స్ త్రినాథ్ రెడ్డి, విశ్రేష్ఠ విద్యా సంస్థ చైర్మన్ నర్ధన ల చేతుల మీదుగా వాలీబాల్ పోటీలను ప్రారంభించారు .ఈ పోటీల్లో 22 జిల్లాలు పాల్గొన్నాయి, మూడు రోజులు పాటు ఈ పోటీలు జరుగుతున్నాయి . రమేష్ బాబు మాట్లాడుతూ మన రాష్ట్ర విభిన్న ప్రతిభావంతులను ప్రోత్సహించి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు. శివశంకర్ మాట్లాడుతూ అంగవైకల్యం శరీరానికే గాని మనసుకు కాదు, నీ చివరి ప్రయత్నం వరకు పట్టుదలతో సాధన చేయాలి, విజయం సాధించాలి అని తెలుపుతూ ఆయన సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. కోటీశ్వరరావు మాట్లాడుతూ మన శరీరంలో లోపం ఉన్నా మన జీవిత పోరాటంలో లోపం ఉండకూడ దని అని అన్నారు. అన్నివిధాలుగా కి సహకరిస్తుందని తెలిపారు. రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ చాలా అద్భుతంగా ఈ సిట్టింగ్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. బెహరా భాస్కరరావు మాట్లాడుతూ ఇటువంటి మంచి కార్యక్రమానికి సహాయం చేయడం సంతోష అని చెప్పి తన వంతుగా 50 వేల రూపాయలు ప్లేయర్లు అందరికీ ఆయన కళ్యాణమండపంలో అకామిడేషన్ ఉచితంగా కల్పించారు. హనుమంత రావు మాట్లాడుతూ మనిషి బ్రతకడానికి విద్య అవసరం, అలాగే దివ్యాంగులైన మీరు స్పోర్ట్స్ ఆడటం వలన అనేక మందికి మీలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది, ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయి అని చెప్పారు. రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు బోడపాటి శివదత్ మాట్లాడుతూ ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలుపుతూ మీరందించే సహాయ సహకారాలు వికలాంగులకు ఎంతో ఉపయోగ పడతాయి అని అభినందనలు తెలియజేసారు. భారతదేశం ఒలింపిక్స్ లో అర్హత సాధించడానికి, ఆంధ్ర రాష్ట్రం తరుపున పివీ ఏ ఏ పి శక్తి వంచన లేకుండా కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు జంపా నాగ సంతోష్ రావు, దుండంగి స్వరూప్, చుక్కా గణేష్, బత్తిన గోవిందరావు, బోడపాటి జగదీష్, బర్రె నాగసత్య, మధు, అరుణ్ కుమార్, నాని, మద్దాల నానాజీ, పరదేశ్, దుర్గారావు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాలు నిర్మూలనకై ప్రచారం

**గొలుగొండ ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**

బాలల హక్కులను హరించే విధంగా బాల్యవివాహాలను ప్రోత్సహించవద్దని మండలంలో బాల్యవివాహాలు నివారణకు ప్రచార రథం ఏర్పాటు చేసినట్లు ఫీడ్ ఆర్గనైజేషన్ కోఆర్డినేటర్ కెవి చిన్నారావు అన్నారు బాల్యవివాహాలు నిర్మూలనకు వంద రోజులు కార్యక్రమం చేపట్టామన్నారు. బాల్యవివాహాలు ఒక సాంఘిక దురాచారంగా భావించి ప్రతి ఒక్క తల్లిదండ్రులు సరైన వయసులోనే పిల్లలకు పెళ్లిళ్లు నిర్ణయించాలని ప్రచారం నిర్వహించారు. సీడ్ ఆర్గనైజేషన్ వారి అధ్యరములో లో చైల్డ్ మేరేజ్ పైన ప్రచార రదము చే గ్రామంలో కొత్త ఎల్లవరం, కసిమి, గుండు పాల కొత్తూరు పంచాయతీలో ప్రచారం కొనసాగించారు. 18 సంవత్సరాల కంటి తక్కువ వయసు గల పిల్లలకి బాల్యవిహహము చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని అన్నారు. బాల్యవివాహాలు నిర్మూలనకు జీవో నెంబర్ 31,39 అమల్లో ఉందని తెలిపారు. ఈ ప్రకారం బాల్యవిహలను ప్రోత్సహించవద్దని అటువంటి వారిపైన తక్షణమే చట్టపరమైన చర్యలు తప్పు అన్నారు. ఈ ప్రచార రదము చే అవగాహన కల్పించడం ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో సీడ్ ఆర్గనైజేషన్ కోఆర్డినేషర్ కే వి చిన్నారావు, సి డబ్ల్యూ ఎస్ మహాలక్షి, ప్రసాద్, డిసిపియు సోషల్ వర్కర్ ఏ అరుణ, సూపర్వైజర్ ఏ విజయలక్ష్మి పి సత్యవతి మరియు ఏ డబ్ల్యు డబ్ల్యు సభ్యులు ప్రచారంలో పాల్గొన్నారు.

## మహాశివరాత్రి ఏర్పాట్లపై ఉమా ధర్మ లింగేశ్వర స్వామి ఆలయాన్ని తనిఖీ చేసిన డి.ఎస్.పి

**(రాంబిల్లి ఫిబ్రవరి 11 ప్రభాతవార్త)**

రాంబిల్లి మండలం పంచదారల గ్రామంలో కొలువై ఉన్న శ్రీ ఉమాధర్మలింగేశ్వర స్వామి ఆలయాన్ని డి.ఎస్.పి విష్ణు స్వరూప్ సందర్శించారు,15వ తేదీ ఆదివారం జరుగు మహాశివరాత్రి మహోత్సవాల నిర్వహణ నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో పరిశీలించారు, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, త్రాగునీరు, విద్యుత్, వైద్య సదుపాయాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు, ఉత్సవాలు శాంతియుతంగా సక్రమంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు దిశా నిర్దేశం చేశారు, ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరగాలంటే అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆయన స్పష్టం చేశారు, ఈ కార్యక్రమంలో ఈవో తేజ, సిఐ సిహెచ్. నర్సింగరావు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## అమ్మపేటలో గౌరమ్మకు సారే..

**గొలుగొండ ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**

అమ్మపేట గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ గౌరీ పరమేశ్వరుల ఉత్సవాలు ఎంత వైభవంగా నిర్వహించారు. గ్రామంలో గౌరీ పరమేశ్వరులు ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు చేసి గ్రామస్తులంతా భక్తి శ్రద్ధలతో అమ్మవారికి తమ మొక్కులను సమర్పించారు. గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల అనంతరం అణుపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి సారే కార్యక్రమం భారీగా సమకూర్చి ప్రతి ఇంటి నుంచి పిండివంటలతో అమ్మవారికి సారే ఏర్పాటు చేసి ఊరేగింపుగా సాగనంపారు. స్థానికంగా ఉన్న తాండవాలో అణుపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గొల్లు రవి గొల్లు సత్యనారాయణ, రమణ, యాదవ సంఘం నాయకులు బాబులు గ్రామ పెద్దలు మహిళలు పిల్లలు సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## నేడే నల్లమారం పండగ...

**మాకవరపాలెం ఫిబ్రవరి 11 ప్రభాతవార్త**

మాకవరపాలెం మండలం కొండలఅగ్రహారం గ్రామంలో వెంచేసిన శ్రీశ్రీశ్రీ నల్లమారమ్మ పండుగ ఘనంగా జరుగుతుంది. ఈమేరకు మంగళవారం అమ్మవారి జాతర ప్రారంభం కాగా బుధవారం రెండవరోజు అమ్మవారి జాతర కార్యక్రమం నిర్వహించారు. నర్సీపట్నం తాళ్లపాలెం ప్రధాన రహదారి సర్పానది సమీపంలో వేంచేసిన నల్లమారమ్మ అమ్మవారు పండుగను అత్యంత,ఘనంగా సాంప్రదాయ పద్ధతిలో నిర్వహించడం ఆనవాయతి. మూడు రోజులపాటు జరిగే అమ్మవారి జాతర కార్యక్రమంలో కొండల అగ్రహారంతో పాటు చుట్టుపక్క గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. నర్సీపట్నం తాళ్లపాలెం ప్రధాన రహదారిలో వెళ్లే ప్రతి వాహనదారులు అమ్మవారి ఆలయము వద్ద ఆగి కొబ్బరికాయలు కొట్టి మ్రొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీగా వస్తుంది. కొండఅగ్రహారంతో పాటు నర్సీపట్నం, రోలుగుంట మండలాల చెందిన పలు గ్రామాల ప్రజలు ఇటుగా వస్తున్న వాహనదారులు అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు తీసుకోవడం పరిపాటిగా జరుగుతుంది. ఇటువంటి అమ్మవారి జాతరను ప్రతిష్టాత్మకంగా సాంప్రదాయ పద్ధతిలో కొండల అగ్రహారం ప్రజలు పెద్దలు ప్రతి ఏటా నిర్వహించడం జరుగుతుంది. దీనిలో భాగంగా మూడు రోజులపాటు జరిగే అమ్మవారి జాతరలో మంగళ,బుధవారాలలో అమ్మవారి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైసీపీ అధ్యక్షులు చిటికెల వెంకటరమణ, గ్రామ పెద్దలు పోలిరెడ్డి వెంకటరమణ, చిన్ని, తదితర పెద్దలు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, రుత్తల శ్రీనివాసు, పెట్ల భద్రాచలం, పాసెపు నాగేశ్వరరావు అధిక సంఖ్యలో మండల స్థాయి నాయకులు కొండల అగ్రహారం గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## ఆది శంకరులపై చిన్న జీయర్ వ్యాఖ్యలు సమంజసం కాదు

**చోడవరం,ఫిబ్రవరి 11, ప్రభాతవార్త:**

ఆది శంకరులపై త్రిదండి చిన్న జీయర్ స్వామి వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని ఏపీ బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్వాసుల రామశాస్త్రి అన్నారు. చిన్న జీయర్ వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం మీడియాతో దుర్వాసుల రామశాస్త్రి మాట్లాడుతూ జగద్గురువైన పరమ శివుడే శంకర భగవత్పాదుల రూపంలో భువి పైకి విచ్చేసారని అన్నారు. హైందవ మతంలో కలహాలు రేపే విధంగా జీయర్ స్వామి వ్యాఖ్యలు ఉన్నాయని తెలిపారు. ఆది శంకరాచార్యులను విమర్శించి ద్వేషించే అర్హత గాని, అంత దివ్య జ్ఞానం గాని ఇంత వరకు ఎవ్వరికీ లేదు అని తెలిపారు. చిన్న జీయర్ హిందూమతంలో ఉంటూ హిందూ మతాల వారిని పెద్దలను పై చేసిన వ్యాఖ్యలను బట్టి ఆయన శివ ద్వేషి, ఇతర మతాలకు అతీతుడయ్యాడా అన్న అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. ఆదిశంకరాచార్యులపై చిన్న జీయర్ స్వామి పలికిన వ్యాఖ్యలపై బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిచో ఏపీ బ్రాహ్మణ అర్చక పురోహిత సంక్షేమ సేవా సంఘం తరఫున హిందూత్వాన్ని రక్షించేందుకు పోరాటాలకు సిద్ధమన్నారు.

## ఘనంగా పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి

**(రాంబిల్లి ఫిబ్రవరి 11 ప్రభాతవార్త)**

రాంబిల్లి మండలం బిజెపి మండల అధ్యక్షులు కారే రాముడు అధ్యక్షతన పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి ఘనంగా నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్ననాటి నుంచి ఎన్నో కష్టాలు ఎదురైనా దేశభక్తి మరియు సమాజ సేవ పట్ల ఆయనకున్న నిబద్ధత ఎప్పుడు తగ్గలేదు అని అన్నారు,జీవితమంతా దేశా సేవకే అంకితం చేశారన్నారు, భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుల్లో ఒకరిగా దేశ రాజకీయాల్లో సాంస్కృతిక విలువలు, జాతీయత సమగ్ర అభివృద్ధి అనే సిద్ధాంతాలను ప్రవేశపెట్టిన ఘనత ఈయనకే చెందుతుందన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోవిందరెడ్డి, జనరల్ సెక్రెటరీ నాయుడు, లంకాడ భాస్కరరావు, చింతకాయల గగన్, జిల్లా మహిళా మోర్చా కార్యదర్శి దేవి మరియు బిజెపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధారమఠంలో పారిశుద్ధం పై ప్రత్యేక కార్యక్రమం

**గొలుగొండ ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**

దారమఠం శ్రీ ఉమాదారమల్లేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పారిశుధ్యం పై ప్రత్యేక కార్యక్రమాన్ని ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈనెల 15 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి ఉత్సవాలకు మండల పరిషత్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమంలో గొలుగొండ ఎస్ ఐ పి రామారావు, సర్పంచ్ మామిడి ఆదిలక్ష్మి, ఆనంద్ మరియు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు, క్లాత్ మిత్రలు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధం

**(రాంబిల్లి ఫిబ్రవరి 11 ప్రభాతవార్త)**

రాంబిల్లి మండలం లాలంకోడూరు గ్రామంలో స్వర్గీయ లాలం భాస్కరరావు ఇంటి వద్ద మండల అధ్యక్షులు భరత్ అధ్యక్షతన టిడిపి మండల స్థాయి సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనలో మనకు ఎన్ని విభేదాలు ఉన్నా సరిదిద్దుకుంటూ పోయి వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు సతశాతం విజయం సాధించే దిశగా ప్రణాళికలు రచిస్తున్నామని కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు రాజ్యాంగ పదవులు కానీ పార్టీ పదవులు కానీ తప్పకుండా వస్తాయని అన్నారు, తమ తమ గ్రామాల్లో సమస్యలను వివరిస్తే నేను ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకొని వెళ్లి సాధ్యమైనంత వరకు మీ సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు,ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎంపీ పప్పల చలపతిరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, మాజీ మండల అధ్యక్షులు వసంతవాడ వెంకటేశ్వర్లు (దినుబాబు) పిఎసిఎస్ చైర్మన్ ఎరిపిల్లి చిట్టిబాబు, సీనియర్ టిడిపి నాయకులు రఘురాజు, ప్రధాన కార్యదర్శి కరెడ్ల ఈశ్వరరావు, మండల ఉపాధ్యక్షులు సురాడ అప్పలరాజు, క్లస్టర్ యూనిట్ ఇన్చార్జిలు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యదర్శులు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించిన ఎంపీడీవో మీనా కుమారి

**(ఎస్ రాయవరం ఫిబ్రవరి 11 ప్రభాత వార్త)**

ఎస్ రాయవరం మండలం కర్రివానిపాలెం గ్రామంలో కృష్ణ సాగరం చెరువు లో ఉపాధి హామీ పథకం నందు జరుగుతున్న పనులను బుధవారం ఎంపీడీవో మీనా కుమారి పరిశీలించారు. సందర్భంలో ఎంపీడీవో మాట్లాడుతూ... చెరువు పనుల వేతనదారులు 307 రూపాయలు వచ్చే విధంగా పనులు చేసుకోవాలని. తెలియజేశారు.

## లడ్డు ప్రసాదంపై విషప్రచారాన్ని ఖండించిన మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మీ

**అడ్డతీగల, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**



అడ్డతీగల మండలం రాజం పాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, రంపచోడవరం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ తిరుపతి లడ్డు ప్రసాదంపై జరిగిన విష ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. దేశంలో ప్రసిద్ధిగాంచిన తిరుపతి లడ్డు ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు కూటమి నేతలు చేసిన ఆరోపణలు పూర్తిగా అసత్యమని కోర్టుకు సమర్పించిన సిట్ చార్జ్‌షీట్‌లో స్పష్టంగా తేలిందని ఆమె తెలిపారు. కోర్టు ముందు నిజాలు బయటపడినప్పటికీ, రాజకీయ లబ్ధి కోసం ఇంకా తప్పుడు ప్రచారాలను కొనసాగించడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. దేశవ్యాప్తంగా ఉన్న కోట్లాది భక్తులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని నాగులపల్లి ధనలక్ష్మి డిమాండ్ చేశారు. భక్తుల మనోభావాలతో చెలగాటం ఆడిన ఈ విష ప్రచారానికి బాధ్యులైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా ఆమె కోరారు.

## మత్స్యగుండం శివరాత్రి జాతరను జయప్రదం చేయండి: ఆర్డీఓ లోకేశ్వరరావు

**పాడేరు,ఫిబ్రవరి11, ప్రభాతవార్త:**



అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, హుకుంపేట మండలం మఠం గ్రామంలో వెలసిన మత్స్యగుండం శైవ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని పాడేరు ఆర్డీఓ ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు ఆదేశించారు. బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, పాడేరు డీఎస్పీ అభిషేక్ మరియు వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతర ఏర్పాట్లపై కీలక చర్చలు జరిపారు. ఈ నెల 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు జాతర అట్టహాసంగా జరగనుంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు తాగునీరు, విద్యుత్ సరఫరా, పారిశుధ్యం, మరియు రోడ్డు మరమ్మతుల విషయంలో రాజీ పడకూడదని ఆయా శాఖలను ఆదేశించారు. రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఎక్సైజ్, ఫైర్, విద్యుత్, రోడ్లు మరియు భవనాల శాఖలు పరస్పర సహకారంతో జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పాడేరు డీఎస్పీ, హుకుంపేట సీఐ, ఎస్ఐ ,తహసీల్దార్, ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ , ఎక్సైజ్, ఫైర్ అధికారులు మరియు ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా దిశానిర్దేశం

**అనకాపల్లి, ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త):**



శాంతి భద్రత పరిరక్షణ నేరాల నియంత్రణపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా జిల్లా పోలీసు అధికారులకు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కీలక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. రాబోయే మహాశివరాత్రి బందోబస్తు ఏర్పాట్లు, జిల్లాలో క్రైమ్ రేటు , పెండింగ్ కేసుల పరిష్కారంపై అధికారులకు ఆయన పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సమావేశంలో జిల్లాలోని పుణ్యక్షేత్రాల వద్ద భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. నూతన చట్టాల అమలు 2025 సంవత్సరానికి సంబంధించి అమలులోకి వచ్చిన నూతన క్రిమినల్ చట్టాలపై అధికారుల పనితీరును సమీక్షించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీసు వ్యవస్థపై నమ్మకాన్ని పెంచాలని ఎస్పీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## మహాత్మ జ్యోతిబా పూలే వసతగృహంకు సొంత భవనం కేటాయించాలి

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం బాలాజీ.**

**(ఎస్ రాయవరం ఫిబ్రవరి 11 ప్రభాతవార్త)**

మహాత్మ జ్యోతిబా పూలే వసతగృహం కు సొంత భవనం కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం బాలాజీ అన్నారు. బుధవారం అడ్డరోడ్డు రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్డీవో వి.వి. రమణ కు వినతిపత్రం అందజేశారు. ఎస్. రాయవరం మండలం లింగరాజుపాలెంలో ఉన్న మహాత్మ జ్యోతిబా పూలే బీసీ రెసిడెన్షియల్ సంక్షేమ హాస్టల్ కు సొంత భవనం ఏర్పాటు చేయాలని, అక్కడ మౌలిక వసతులు కల్పించాలని .ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం బాలాజీ మాట్లాడుతూ హాస్టల్ సొంత భవనం లేక మౌలిక సదుపాయాలు సరిగా లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అంతే కాకుండా ఒక తరగతి గది పూర్తిగా లేకుండా పోతుందని ఆయన అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉన్నత అధికారులు స్పందించి ఆ సమస్యలను పరిష్కారం చేయాలని చేయకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు. కారే నానాజీ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో మంజూరు చేసిన పనులు వెంటనే పూర్తిచేయాలి: జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

**అనకాపల్లి, ఫిబ్రవరి 11 (ప్రభాత వార్త):**



జిల్లాలో మంజూరుచేసిన అన్ని అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరు కార్యాలయం నుండి మండల అభివృద్ధి అదికారులు, ఇంజనీరింగు అధికారులు, విద్యుత్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, క్రీడాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పనులు ప్రస్తుత పరిస్థిని సమీక్షించారు. సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ మాట్లాడుతూ జిల్లాకు మంజూరుచేసిన నిర్మాణ పనులన్నింటిని వెంటనే పూర్తిచేయాలని, నిధులు మురిగిపోయినట్లయిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి మండలానికి 5 గ్రామాలను ఒడిఎఫ్ గ్రామాలుగా తీర్చిదిద్దాలని నిర్దేశం చేయడం జరగిందని, ఆ గ్రామాలలో సోక్ పిట్స్, మేజిక్ డ్రయిన్స్ తదితర నిర్మాణాలన్నింటిని పూర్తిచేయాలని తెలిపారు. పాఠశాలలలో, వసతిగృహాలలో జీరో వేస్ట్ మేనేజ్మెటు అమలు చేయాలని తెలిపారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే వెంటనే పూర్తిచేయాలన్నారు. జిల్లాలో వీధికుక్కలు సంతతి పెరగకుండా చర్యలు తీసుకోవాలని, ప్రతి మునిసిపాలిటీ, మండలంలో వీధి కుక్కలకు షెల్టర్లు ఏర్పాటుచేసి మార్చినాటికల్లా జిల్లాలో గల అన్ని వీధికుక్కలకు స్టెరిలైజేషను ప్రక్రియ పూర్తిచేయాలని తెలిపారు. అదేవిధంగా పి.ఎం.సూర్యఘర్ పథకాన్ని ప్రతి విద్యుత్ వినియోగదారుడు వినియోగించుకొనేలా అవగాహన కల్పించాలని విద్యుత్ శాఖ అదికారులకు సూచించారు.

## సైబర్ మోసాలు, మనీ న్యూలింగ్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలి జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్

**అనకాపల్లి, ఫిబ్రవరి 11 (ప్రభాత వార్త):**

భారత రిజర్వ్ బ్యాంక్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను జిల్లా కలెక్టర్ విజయ్‌కృష్ణన్ బుధవారం కలెక్టరు కార్యాలయంలో పోస్టర్లను ఆవిష్కరించి ప్రారంభించారు. ఫిబ్రవరి 9 నుంచి 13 వరకు జరిగే వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా సైబర్ మోసాలు, మనీ న్యూలింగ్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, అంతేకాకుండా కేవైసీ, సికేవైసీ ప్రాముఖ్యతపై ప్రజలకు విస్తృత అవగాహన, ప్రచారం కల్పించాలని బ్యాంకింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత పోస్టర్లు,టీవీ కమర్షియల్ యాడ్స్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ సత్యనారాయణ ఎస్టీసీ కేఆర్సి లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన డీఈవో

**ఎలమంచిలి, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త**

మండలంలోని వంద రోజులు కార్యాచరణ ప్రణాళిక అమలుపై జిల్లా విద్యాశాఖ అధికారి అప్పలనాయుడు పాఠశాలలను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థుల కోసం అమల్లో ఉన్న 100 రోజులు కార్యాచరణ ప్రణాళిక ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న జి ఎఫ్ ఎల్ ఎన్ కార్యక్రమం అమలను సమగ్రముగా సమీక్షించారు. సోమలింగపాలెం జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించి 10వ తారీకు విద్యార్థులతో ప్రత్యక్ష పరస్పర చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పరీక్షలకు ఎలా సన్నద్ధం అవుతున్నారని వారి బలాలను బలహీనతలను భవిష్యత్తు లక్ష్యాలను క్లిష్టమైన అంశాలు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై లోతుగా వివరించారు. వంద రోజులు ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న స్లిప్ టెస్ట్ పురోహితుని పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఓ అప్పారావు, మండల విద్యాశాఖ అధికారి సూర్యప్రకాష్, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లోమొబైల్ ఐసిటిసి ద్వారా హెచ్ ఐ వి పరీక్షలు

**ఎస్ రాయవరం ఫిబ్రవరి 11 ప్రభాతవార్త**

మండలంలో గుర్రాజుపేట గ్రామంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, అనకాపల్లి జిల్లా దిశ డిఎల్ఏటిఓ డాక్టర్ కె స్వప్న సిపిఎం రామచంద్ర సి ఎస్ ఓ స్పందన ప్రశాంతి ఆదేశాల మేరకు చైల్డ్‌ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ ఆధ్వర్యంలో గుర్రాజుపేట గ్రామంలోమొబైల్ ఐసిటిసి ద్వారా హెచ్ఐవి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్ టి ఎన్ శ్రీను.ఎల్ ఏ కె రమణ ఆశా వర్కర్లు, ఏఎన్ఎమ్స్, అంగన్వాడీ టీచర్స్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు అందరు సహకారం అవసరం

**కొయ్యూరు ఫిబ్రవరి 11 ప్రభాతవార్త**

బాల్యవివాహాల నిర్మూలనకు అందరు సహకారం కృషి ఎంతైనా అవసరమని సిడిపిఓ దేవమణి అన్నారు. బుధవారం కొయ్యూరు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అతి మారుమూల గ్రామాలైన మఠం భీమవరం , పోతవరం, చీడికోట ,వాలుగూడెం, చిలకపాలెం గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలు ను సిడిపిఓ దేవ మణి ఆధ్వర్యంలో సూపర్వైజర్లు , బిపిసి సోమశేఖర్ తో కలిసి పర్యటించి, బాల్య వివాహ ముక్తుభారత్ కార్యక్రమంలో భాగంగా పోతవరం గ్రామంలో గర్భిణీలు, బాలింతలు మరియు గ్రామ పెద్దలు కు బాల్య వివాహ నిర్మూలనకు అందరూ కృషి చేయాలని అవగాహన కల్పించి, బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే అనర్ధాలు గురించి తెలియజేసి ర్యాలీ చేశారు. అంగన్వాడి కేంద్రాల్లో ఉన్న ప్రీస్కూల్ పిల్లల బరువులు, ఎత్తులు ను పరిశీలించి, పిల్లలు పెరుగుదల గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు విజయలక్ష్మి, సత్యవతి , కనకమహాలక్ష్మి , బి పి సి సోమశేఖర్, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు విద్యా ప్రమాణాలు మెరుగుపరచుకోవాలి

**ఆశ్రమ పాఠశాలలను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్**

**కొయ్యూరు ఫిబ్రవరి 11 ప్రభాతవార్త**

రానున్న పదో తరగతి పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు తమ తమ విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరుచుకోవాలని జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ అభిప్రాయపడ్డారు. బుధవారం ఆయన మండలంలోని కొయ్యూరు జిపిడబ్ల్యూఎస్ బాలురు 1, పెదమాకవరం బాలికల ఆశ్రమ పాఠశాలను, శరభన్నపాలెం బాలురు ఆశ్రమ పాఠశాలను ఏపీడబ్ల్యుఓ క్రాంతి కుమార్ తో కలిసి విజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందించారు. పదో తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయుల కృషి చేయాలని, అదే సమయంలో విద్యార్థులు విద్యాభ్యాస తీరును మెరుగుపరచుకోవాలని సూచించారు. కొయ్యూరు బాయ్స్ 1 పాఠశాలలో ఆయన ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## గంగులయ్యను కలిసిన మండల జనసైనికులు స్థానికపై చర్చ

**కొయ్యూరు ఫిబ్రవరి 11 ప్రభాతవార్త**



బుధవారం పాడేరు నియోజకవర్గం జనసేన పార్టీ కార్యాలయంలో అరకు పార్లమెంటరీ, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్, ఆంధ్ర రాష్ట్ర జానపద కళలు సృజనాత్మక అకాడమీ చైర్మన్ డా. వంపూరు గంగులయ్య తో మండల జనసైనికులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా అయిదు మండలాల నియోజవర్గ ముఖ్య నాయకులతో రానున్న స్థానిక ఎలక్షన్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులతో ఏ విధంగా సమన్యాయం చేసుకోవాలి? అనే విషయమై చర్చించారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి త్వరలో 5 మండలాల మండల కమిటీని కూడా ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా త్వరలో మండలంలో గంగులయ్య పర్యటన ఉన్న నేపథ్యంలో ఆ విషయం కూడా పార్టీ నాయకులతో చర్చించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు గూడెం లక్ష్మణ్, మహిళా మండల అధ్యక్షురాలు సెగ్గె భావన సాయి జయంతి, మండల ప్రధాన కార్యదర్శి గూడెపు శేషుబాబు, మండల ఉపాధ్యక్షుడు పొట్టిక రాంప్రసాద్, మంప పంచాయతీ అధ్యక్షుడు కాటం నాగేంద్రబాబు, బకులూరు పంచాయతీ అధ్యక్షుడు కూడ నవీన్, వెలగల పాలెం పంచాయతి అధ్యక్షుడు కొర్రా రాజు, రాజేంద్రపాలెం అధ్యక్షుడు పీట సుధీర్ బాబు, పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

## సమ్మె జయప్రదం కోరుతూ సిఐటియు బైక్ ర్యాలీ

**అరకు రూరల్, ఫిబ్రవరి 11, ప్రభాత వార్త**



పాత కార్మిక చట్టాలు కొనసాగించాలని కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12 న జరిగే దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని అల్లూరు జిల్లా అరకు లోయలో బుధవారం సి ఐ టి యు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. సి ఐ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు జండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం తీసుకొచ్చిన లేబర్ కోడ్స్ కార్మికులను బానిసలుగా చేస్తాయని కార్పొరేట్లకు పెట్టుబడిదారులకు లాభం కోసం కార్మికులను పణంగా పెట్టి మోడీ ఈ నిర్ణయం తీసుకున్నారని దీనివలన కార్మికులు తీవ్రమైన నష్టం ఎదుర్కొంటారని తెలిపారు. పోరాడే హక్కు కోల్పోతారని అన్నారు ఫిబ్రవరి 12 న జరిగేది సమ్మె దేశంలో ఉన్న 500 సంఘాలు పాల్గొంటున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా కార్మికులందరూ సమ్మె జయప్రదం చేయాలని వ్యాపార వర్గాలు సమ్మెకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐ టి డి ఏ వర్కర్స్ యూనియన్ నాయకులు దాడి రాజు, సి ఐ టి యు జిల్లా ఉపాధ్యక్షులు బాగత్రామ్, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు రామారావు, రామన్న, నాని బాబు,వీఆర్ఏ సంఘం నాయకులు అప్పారావు, ఆటో యూనియన్ నాయకులు రాజు, జోషి సిఐటియు మండల నాయకులు మగ్గన్న, రమేష్, నాగేంద్ర పాల్గొన్నారు.

## తిరుపతి కల్తీ లడ్డు వ్యవహారంలో సిట్ నివేదికను బహిర్గతం చేయాలి

**- జనసేన పార్టీ ఇంచార్జి డా..వంపూరు గంగులయ్య:**

**పాడేరు,ఫిబ్రవరి11, ప్రభాతవార్త**



తిరుపతి కల్తీ లడ్డు వ్యవహారంలో సిట్ నివేదికను బహిర్గతం చేసి నేరపూరిత చర్యలకు పాల్పడిన వ్యక్తులకు శిక్షపడాలని..అలాగే కల్తీ లడ్డు వ్యవహారం ప్రజలకు పార్టీ సమాచారం తెలియజేయాలని రాష్ట్ర జానపద కళలు మరియు సృజనాత్మక అకాడమి చైర్మన్, జనసేన పార్టీ ఇంచార్జి డా..వంపూరు గంగులయ్య డిమాండ్ చేసారు. ప్రజల మనోభావాలకు విరుద్ధంగా నడుచుకుంటున్న వైసిపి పార్టీ మనుగడ భవిష్యత్ లో ఏవిధంగా ఉంటుందో తెలియలేని పరిస్తితి గంగులయ్య పేర్కొన్నారు.బుదవారం పాడేరు జిల్లా కేంద్రం జనసేన పార్టీ కార్యాలయంలో పార్టీ సమీక్ష సమావేశం చైర్మన్ గంగులయ్య నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో చైర్మన్ మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం హయంలో చేసినటువంటి ధర్మ విరుద్ధమైన హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా తిరుమల తిరుపతి లడ్డూను కూడా రసాయనాలతో కూడిన నెయ్యిని వాడి కల్తీ చేసి భక్తుల మనోభావాలను కించపరిచారు. లడ్డు వ్యవహారంపై వైసిపి కోట్లాది మంది భక్తులకు క్షమాపణ చెప్పి నిజాన్ని ఒప్పుకోవాలని గంగులయ్య డిమాండ్ చేసారు. సమావేశంలో నియోజకవర్గ ముఖ్యనాయకులు జిల్లా కార్యదర్శి ఉల్లి సీతారాం. తల్లే. త్రిమూర్తులు పీ ఏ సి ఎస్ చైర్మన్. తల్లే త్రిమూర్తులు.పాంగి. శివాజీ.మార్కెట్ డైరెక్టర్. వంపూరు సురేష్.కోపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్. కిమ్ముడు కృష్ణ మూర్తి మార్కెట్ డైరెక్టర్. బొంకులు. దివ్యలత. అధికార ప్రతినిధి సెగ్గే. భావన సాయి జయంతి. విరామహిళా. జి.. పార్వతమ్మ. విరామహిళా.నాందోలి. మురళి కృష్ణ మండల అధ్యక్షులు. మసాడి భీమన్న. మండల అధ్యక్షులు. జీ. మాడుగుల లక్ష్మణ్ మండల అధ్యక్షులు కొయ్యూరు మండలం గొర్లె. వీర వెంకట్. ఎగ్జిక్యూటివ్ మెంబర్ జీకే వీధి మండలం. బత్తుల సిదార్ధ మార్క్. ఉపాధ్యక్షులు జీకే వీధి మరియు తదితరులు పాల్గొన్నారు.

## రీ సర్వే ప్రక్రియ, మ్యూటేషన్, పట్టాదారు పాస్ పుస్తకాలు పూర్తి చేయాలి

**పాడేరు, ఫిబ్రవరి11, ప్రభాతవార్త**



గిరిజన ప్రాంతాల్లోని భూ సమస్యలు, రెవెన్యూ పరిపాలనకు సంబంధించి జిల్లా ఇంచార్జి జాయింట్ కలెక్టర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి, ఇంచార్జి ఆర్డిఓ, ప్రాజెక్టు మేనేజ్మెంట్ యూనిట్ వారితో చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు మండలాలకు సంబంధించిన భూమిపై రీ సర్వే, మ్యూటేషన్, రైతులకు భూపూర్తి హక్కులు వంటి అంశాలపై సమీక్షించిన జిల్లా కలెక్టర్. బుధవారం కలెక్టర్ చాంబర్లో చింతపల్లి, జి కే వీది, కొయ్యూరు మండలాలలో రెవెన్యూ సదస్సులలో దరఖాస్తు చేసుకున్న సుమారు సంబంధించిన 11వేల రెవెన్యూ మ్యూటేషన్ అప్లికేషన్స్ రాగా, అందులో 3 నుండి 4 వేల పూర్తి క్లోజ్ తో పూర్తి స్థాయిలోన్పరిషరించగా, 6 నుండి 7 వేల పెండింగ్ అప్లికేషన్లను100 రోజుల్లో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకుని పెండింగ్ లో ఉన్న మ్యుటేషన్ సమస్యలకు సంబంధించిన అప్లికేషన్లను పూర్తి విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చింతపల్లి, జి కె విధి మండలంలో గ్యాప్ ఏరియాకు సంబందించిన రెవిన్యూ, ఫారెస్ట్ భూములను రెవెన్యూ సిబ్బంది, మండల తాసిల్దార్, ఫారెస్ట్ అధికారులు కలిసి సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి మూడు రోజుల్లో సమస్యలను పరిష్కరించాలన్నారు. రెవెన్యూ గ్రామాలకు ఎల్ జి కోడ్ (లోకల్ గవర్నమెంట్ కోడ్) ప్రతి రెవెన్యూ గ్రామానికి ఎల్ జి.కోడ్ కేటాయించడం ద్వారా ప్రభుత్వ పథకాలు, నిధులు మరియు ఆన్‌లైన్ సేవలు నేరుగా ఆ గ్రామానికి చేరుతాయి. ఇది పరిపాలనా సౌలభ్యానికి చాలా ముఖ్యమని మండల తాసిల్దార్ పరిశీలించి రెవెన్యూ గ్రామ కోడ్ నిర్ధారణచేసి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జి జాయింట్ కలెక్టర్, ఐ టిడిఏ ప్రాజెక్ట్ అధికారి తిరుమణి శ్రీపూజా, ఇంచార్జి డిఆర్ఓ అంబేద్కర్, ఇంచార్జి ఆర్డిఓ ఏం వి ఎస్ లోకేశ్వరరావు, సిపిఓ పి. ప్రసాద రావు, పి ఎం యూ ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ అధికారి రామ్ గోపాల్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి పనులల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి..



తెర్లాం ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

ఉపాధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాజాం క్లస్టర్ ఏపిడి చంద్రకుమారి ఆదేశించారు. బుధవారం ఆమె మండలంలో పూనువలస, కాగాం పంచాయతీలలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఆమె ఉపాధి శ్రామికులతో మాట్లాడారు. ప్రతి 10 మంది శ్రామికులు గ్రూప్ గా ఉండి, అందుకు తగ్గట్టుగా పని ముట్లు ఉండాలన్నారు. ముందస్తు కొలతలు ప్రకారం, కనీస వేతనం 307 రూపాయలు వచ్చేటట్టు పనిచేయాలన్నారు.అనంతరం మస్టర్ పేరు పేరున పిలిచి వెరిఫికేషన్ చేశారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు ఈ.సి బుజ్జి, సాంకేతిక సహాయకులు మానస, శంకర్ రావు, క్షేత్రసహాయకులు ఉన్నారు.

## ఇటు డిపోరైస్ లారీ మధ్యనజనాలు అటు అన్నక్యాంటిన్ ..!

సాలూరు ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



సాలూరు పట్టణ ఎమ్మార్వో ఆఫీస్ వెనుక ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ పౌర సరఫరాల నిల్వగిడ్డంగి పెద్ద తలనొప్పిగా తయారైందని టౌన్ టాక్ వినపడుతుంది. ఎందుకంటే నియోజకవర్గ ప్రజలు తమ వ్యక్తిగత పనులపై నిత్యం ఎమ్మార్వో ఆఫీస్‌కి రావడంతో ఎప్పుడు రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా పనిపాట లేని భాతాఖానీ బ్యాచీలు చెట్టుకింద తిరుగ్గా రిలాక్స్ అవుతుంటాయి. ఇది ఇలాఉంచితే ప్రతినెల టౌన్ లో ఇంకా రూరల్‌లో ఉన్న 57 రైస్ డిపోలకు ఇంకా 21 హస్టల్స్ కు రైస్ రవాణా చేసేందుకు లారీలు పౌరసరఫరాల గోడౌంకు వచ్చి పోతుంటాయి.దీనివలన అక్కడకు వచ్చే జనాలకు ఇబ్బందికరంగా మారింది. అంతే కాకుండా ఉగాదికి అన్నాక్యాంటీన్ ప్రారంభం కానుందని సమాచారం.దీంతో అక్కడ మరింత గందరగోళం పరిస్థితులు తలెత్తే అవకాశం లేకపోలేదని విమర్శలు వినిపిస్తున్నాయి.ఇప్పటి పరిస్థితి ఇలాగ ఉంటే అన్నాక్యాంటీన్‌కు భోజనం కోసం వచ్చే పేదప్రజలు మరింత ఇబ్బందికి గురౌతారని పలువురు భావిస్తున్నారు. అందువలన ఇక్కడ ఉన్న ఎంఎల్ఎస్ పాయింట్ సరుకుల నిల్వ గిడ్డంగిని దండిగాం రోడ్ లో ఉన్న ఏఎంసి మార్కెట్ యార్డ్‌కు తరలించాలని ఎప్పటి నుండో సర్వత్ర అభిప్రాయం వ్యక్తమౌతుంది.మంత్రి మేడం దీనిపై దృష్టిపెట్టి ఈ సమస్య పరిష్కరించాలని పట్టణ ప్రజలు గట్టిగా కోరుతున్నారు.

## మీ సొంత ఇంటిని త్వరలో పూర్తి చేయాలి - తహసీల్దార్ అజు రఫీ జాన్



రామభద్రపురం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

ఉగాది గృహప్రవేశాలు నిమిత్తం కోటసిర్లం, పాడి వాళ్ళ వలస, ముచ్చర్ల వలస, చింతలవలస లేఔట్లు లబ్ధిదారులతో తాసిల్దార్ అజు రఫీ జాన్ హౌసింగ్ ఏఈ వెంకటేశ్వర్ రావు, సురేష్ మరి హౌసింగ్ సిబ్బంది గ్రామ నాయకుడు తౌడు స్థానిక సర్పంచ్ ఎంపిటిసి వారు కలిసి ప్రతి ఇంటికి ఇంటికి తిరిగి లబ్ధిదారులు ఉగాదిలోపు మీ సొంత ఇంటిని మీరు పూర్తి చేసుకొని గృహ ప్రవేశం చేయవలసిందిగా చెప్పడం జరిగినది కోటమే ప్రభుత్వం వచ్చిన తర్వాత అదనంగా 50 వేల రూపాయలు పెంచడం జరిగినది ఉగాదిలోపు పూర్తి చేయని ఇండ్లకు నోటీసులు కూడా ఇవ్వడం జరిగినది కట్టని ఎడల ఆ ఇంటి పట్టాతో పాటు ఇంటిని రద్దు అయ్యే అవకాశం ఉంది. కావున సదరులందరూ ఈ అవకాశాన్ని వినియోగించవలసిందిగా అన్నారు.

## మహిళా రైతు సంఘాలు కూడా బలోపేతం కావాలి.. ఎంపీడీవో సురేష్

చీపురుపల్లి ఫిబ్రవరి 11, ప్రభాతవార్త



డ్వాక్రా సంఘాల వలె మహిళా రైతు సంఘాలు కూడా బలోపేతం కావాలని చీపురుపల్లి ఎంపీడీవో ఐ సురేష్ సూచించారు. బుధవారం నాడు చీపురుపల్లి మండల సమైక్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘ నాయకులకు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లా దుతూ రైతు ఉత్పత్తి దారుల సంఘాలు బలోపేతం కి కృషి జరపాలని కోరారు. మహిళా రైతు సంఘాలను కూడా బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి జరుపుతుందని ఈ సందర్భంగా వివరించారు. ఇందులో భాగంగా మహిళా రైతులకు వ్యవసాయం చేయుటకు అవసరమయ్యే వ్యసాయ పరికరాలు ను, కష్టం హైరింగ్ సెంటర్ ద్వారా, అద్దెకు ఇవ్వడం, కోల్డ్ స్టోరేజ్ ఏర్పాట్లు, గౌడౌన్లు ఏర్పాటు, సమీకృత వ్యవసాయ విధానం (ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్ ) ప్రభుత్వం ద్వారా జరుగుతుందన్నారు. తద్వారా రైతులు ను అధిక ఆదాయం వచ్చే ఉద్యాన పంటలు వైపు మళ్లించడం, అలాగే మహిళా రైతు సంఘాలకు, వ్యవసాయం చేయడంలో ఆధునిక సాంకేతికత విజ్ఞానం అందించడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది అని వివరించారు, వీటన్నింటినీ అందిపుచ్చుకోవాలి అంటే, మహిళా రైతు గ్రూప్ లను బాగా నడిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం ఎన్. అప్పలనాయుడు, ఏ పీ ఓ అదిబాబు, పలువురు సీసీలు, మహిళా రైతు గ్రూప్ లీడర్స్ తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాల నిరోధంపై గ్రామాల్లో ప్రచారం



నెల్లిమర్ల, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

జిల్లా బాలల రక్షణ విభాగం మిషన్ వాత్సల్య, మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ, యూత్ క్లబ్ బెజ్జిపురం స్వచ్ఛంద సంస్థ ప్రతినిధుల సంయుక్త ఆధ్వర్యంలో నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట, మండలంలోని మొయిద, కొండగుంపాం గ్రామాల్లో బుధవారం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాల్ని బాల్య వివాహ విముక్త భారత్ ప్రచార రథం ద్వారా చేపట్టారు. ఈ ప్రచార రథం ద్వారా గ్రామాల్లో ప్రజలందరికీ బాల్యవివాహాలు చేసుకోవడం వల్ల వచ్చే నష్టాలు గురించి, బాల్య వివాహ నిషేధ చట్టం 2006 లో ఉన్న అంశాల పైన అవగాహన కల్పించారు. ప్రజలందరిలో బాల్య వివాహాల పట్ల అవగాహన కల్పిస్తూ వారి మద్దతు కోరుతూ ఈ సందర్భంగా బాలలకు సంబంధించి ఉన్న టోల్ ఫ్రీ నెంబర్స్ 1098, 112, 18001027222 టోల్ ఫ్రీ నెంబర్లకు సమాచారం అందించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ ఎం.ఎం నాయుడు, ఎన్జీవో ప్రతినిధులు శివశంకర్, ఐసిడిఎస్ సూపర్వైజర్లు బొడ్డల శారద, త్రినాధ, విజయనగరం వన్ స్టాప్ సెంటర్ ఏఎస్ఐ శోభారాణి, పంచాయతీ కార్యదర్శులు తవుడు, మోహన్, మహిళా సంరక్షణ కార్యదర్శులు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్స్ పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే భేష్..

### రోగులకు రెండు కోట్ల 73లక్షల చెక్కులు పంపిణీ..



శృంగవరపుకోట,ఫిబ్రవరి11,ప్రభాతవార్త

సీఎం సహాయనిధి(సీఎం ఆర్ఎఫ్) చెక్కుల పంపిణీలో ఎస్.కోట నియోజక వర్గం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి జిల్లాలోనే ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి దాదాపు ఇరవై నెలల్లో నియోజక వర్గంలో క్యాన్సర్,గుండె శస్త్రచికిత్సలు, మూత్రపిండాల మార్పిడి ఇలా వివిధ రకాలుగా ప్రమాదకరమైన చికిత్సలు పొందిన సుమారు 320మంది రోగులను సీఎం సహాయనిధి ద్వారా ఆమె ఆదుకున్నారు.మొత్తం 320రోగుల కుటుంభాలకు రెండు కోట్ల 73లక్షల 79వేల రూపాయలు చెక్కుల రూపంలో నగదును అందజేసినట్లు సమాచారం. అనారోగ్యంతో బాధపడుతున్న మొత్తం 396మంది రోగులకు సంబంధించి సీఎంఓ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపగా ఇందులో 320మంది రోగులకు సీఎం సహాయనిధి కింద నగదు మంజూరైనట్లు తెలిసింది.సీఎం సహాయనిధి ద్వారా నియోజకవర్గంలో రోగులను ఆదుకోవడంలో ఎమ్మెల్యే కోళ్ల పదేపదిగా ముఖ్యమంత్రి చంద్రబాబు,ఐటీ శాఖ మంత్రి లోకేష్ లను కలవడం లోతుగా ఈవిషయాలను వారి దృష్టికి తీసుకెళ్లడంతో ఆమె కృషి ఫలించినట్లు తెలుస్తుంది. అదేవిధంగా నియోజకవర్గ అభివృద్ధికి ఇతర కార్యక్రమాలు నెరవేర్చేందుకు ఎమ్మెల్యే కోళ్ల విశేష కృషి చేస్తున్నారనడంలో ఎటువంటి సందేహం లేదు.

## ఎంపీడీవో అందజేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు నాయకులు

పాచిపెంట ,ఫిబ్రవరి 11. ప్రభాతవార్త



పాచిపెంట మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయం సిబ్బందికి ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు సార రామారావు మరడ రాము అప్పారావు ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం పాచిపెంట సిబ్బందికి సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం ఇవ్వాలని జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని మ్యాండేసి రద్దుచేసి ఉద్యోగ భద్రత కల్పించాలని దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఉపాధి హామీని పాత పద్ధతుల్లో కొనసాగించాలని మహాత్మా గాంధీ పేరును కొనసాగించాలని కోరారు. ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తే పేద ప్రజలు బతకడం కష్టం ఉపాధి హామీ వలన నివారణ జరిగాయని కేంద్రం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40% అనే పేరుతో ఉపాధి హామీని నిర్వీరించేసే పద్ధతులు అత్యంత హానికరమని అన్నారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ మహాత్మా గాంధీ పేరును తొలగించడం వెనుక ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్ చేసి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పోరేట్ పెట్టుబడుదారులకు ఉపాధి హామీ చట్టాన్ని అప్పగించికూలీలు పొట్ట కొట్టడమేనని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం పనిగంటలు పెంచడం బ్రిటిష్ కాలమ నుండి పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను 28 కార్మిక చట్టాలు రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్ తీసుకొచ్చి కార్మిక వర్గానికి తీరని ద్రోహం చేశారని ఫిబ్రవరి 12 సమ్మె కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక గుణపాఠం కావాలని కార్మిక వర్గమంతా కథలాలని సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

## పారమ్మకొండకు విచ్చేసే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు

### మహా శివరాత్రి దృష్ట్యా పటిష్ట భద్రతా చర్యలు : జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి వెల్లడి

పాచిపెంట, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త



మహాశివరాత్రి పురస్కరించుకుని మండలంలో పనుకోవలసి పంచాయతీ పెద్ద చీపురు వలస సమీపంలో వెలసిన పారమ్మకొండ దేవాలయంను జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి కుటుంబ సభ్యులతో బుధవారం ఉదయం పార్వతీ పరమేశ్వరలునుదర్శించుకున్నారు. అధికారులతో మాట్లాడుతూ మహాశివరాత్రి పురస్కరించుకొని ఈనెల 15న పార్వతీ పరమేశ్వరులును దర్శించుకునేందుకు వచ్చిన ?భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్ర పరిసరాల్లో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలని, భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని సూచించారు. క్యూ లైన్ల క్రమబద్ధీకరణ, భద్రతా ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శనం చేసుకుని ఆనందంగా ఇంటికి చేరుకునేలా చూడాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఆలయానికి విచ్చేసిన కలెక్టరుకు ఈఓ, అర్చకులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పారమ్మ తల్లి చిత్రపటాన్ని కలెక్టర్‌కు అందజేశారు. జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన పారమ్మకొండ దేవాలయాన్ని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం కొండపై ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొండపై ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ప్రతి చోటా డస్ట్ బిన్లను ఏర్పాటు చేయాలని, తడి చెత్త – పొడి చెత్త వేరు చేసేలా ఫ్లెక్సీల ద్వారా అవగాహన కల్పించాలని ఆదేశించారు. కొండ దిగి వచ్చిన భక్తులకు కాళ్ళ నొప్పుల నుండి ఉపశమనం కలిగించేలా 'గోరువెచ్చని నీటి' సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని, దీనికి అతి తక్కువ రుసుము వసూలు చేయాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులుకు తినుబండారాల అంగడెలు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. భక్తులకు అవసరమైన సాయం అందించేందుకు వాలంటీర్లను సిద్ధం చేయాలని, వారు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ ఏర్పాట్ల ద్వారా భక్తులకు మరింత మెరుగైన సేవలందించడమే లక్ష్యం కావాలని కలెక్టర్ వెల్లడించారు. ఈయన వెంట ఏఎంసీ ఛైర్మన్ ముఖి సూర్యనారాయణ ఏఎంసీ డైరెక్టర్ పూసర్ల నర్సింగరావు, తహసిల్దార్ రవి ఎంపీడీఓ, సాలూరు రూరల్ సీఐ రామకృష్ణ ఆలయ ఈవో రమేషు,వివిధ శాఖల అధికారులు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ బైండోవర్ కేసులు ఎత్తి వేయాలి

శృంగవరపుకోట,ఫిబ్రవరి11,ప్రభాతవార్త



తమపై అక్రమంగా నమోదు చేసిన బైండోవర్ కేసులు ఎత్తివేయాలని పలువురు నాయకులు బుధవారం తహశీల్దార్ శ్రీనువాసరావు ఫిర్యాదు చేశారు. నాయకులు వసి వెంకట్రావు మాట్లాడుతూ రాజకీయ కక్షసాధింపులో భాగంగానే సుధారాజు వర్గీయులను టార్గెట్ చేస్తున్నారని మండి పడ్డారు. తమ నాయకురాలు సుధారాజు ఇంటికి వెళ్లడం వ్యక్తిగత పనుల నిమిత్తం తిరగడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఎక్కడా గొడవలకు తావులేకుండా ప్రశాంతంగా ఉన్నా కావాలనే తమపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. జిందాల్ ఆవరణలో నిన్న గొంప కృష్ణ రైతులను రెచ్చగొట్టేలా మాట్లాడినా వారిపై ఎటువంటి చర్యలు లేవని కానీ మమ్మల్ని ఎందుకు టార్గెట్ చేస్తున్నారో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో ఆరు నెలల క్రితం పెట్టిన బైండోవర్ కేసుల గడువు ముగిసినా మళ్లీ ఇప్పుడు కొత్తగా నోటీసులు ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. వెంటనే తమపై పెట్టిన అక్రమ బైండోవర్ కేసులను ఎత్తివేయాలని అంటూ తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, మాజీ ఎంపీపీ ఒంటి అప్పారావు, పెదఖండేపల్లి సర్పంచ్ రమణ, నాయకులు గోవింద్,చల్లా రాము,మురళి రాజు, వబ్బిన సతీష్, కర్రి సత్యనారాయణ,సుంకర బుల్లి పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న ఎడ్ల పరుగు పోటీలు

### విజయవంతంగా ముగిసిన పరదేశమ్మ పరస



వేపాడ, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త

వేపాడ మండలంలోని చినగుడిపాల గ్రామంలో రెండు రోజులపాటు (మంగళ, బుధవారం)జరిగిన శ్రీ పరదేశిమాంబ తీర్థ మహోత్సవము అత్యంత వైభవంగా ముగిసింది. పరిసర గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గ్రామదేవతకు ప్రత్యేక పూజలు ,అభిషేకాలు, నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు అలాగే మహిళా కోలాటం, డాన్స్ బేబీ డాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక సర్పంచ్ బోజంకి రామునాయుడు ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన జిల్లాస్థాయి ఎడ్ల పరుగు పోటీలు ప్రజలను బాగా ఆకట్టుకున్నాయి . ఈ పోటీలలో విజేతలగా నిలిచిన ఎడ్లబండ్ల యజమానులకు వేలాది రూపాయలు నగదు బహుమతులను అందజేశారు. ఈ పరస సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో విజయవంతంగా ముగిసింది.

భోగాపురం ముంజేరు రైతుల భూముల సమస్యలు పరిష్కరించండి

## హోమ్ మంత్రి అనితకు బంగార్రాజు విజ్ఞప్తి

నెల్లిమర్ల, ఫిబ్రవరి 11, ప్రభాతవార్త



జిల్లాలోని భోగాపురం ముంజేరు గ్రామాల రైతులకు సంబంధించిన భూముల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మార్క్ ఫెడ్ చైర్మన్, టిడిపి నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కర్రోతు బంగార్రాజు రాష్ట్ర హోం శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి అయిన వంగలపూడి అనితకు విజ్ఞప్తి చేశారు. అమరావతిలో బుధవారం హోం మంత్రి అనితను, ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిశారు. భోగాపురం, అదే మండలంలోని ముంజేరు రైతుల సమస్యలను వారికి వివరించారు. సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని వారికి విన్నవించారు. అలాగే ఎందుకు సంబంధించిన వినతి పత్రాలను కూడా అందజేశారు. ఇందుకు మంత్రులు సానుకూలంగా స్పందించారని బంగార్రాజు ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. మంత్రి లు కూడా సమస్యలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కొమ్మూరు శుభోషనరావు, నాయకులు పడాల శ్రీనివాసరావు, మాత నవీన్ , పల్లా రాంబాబు, బొడ్డా హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రికి పక్కా ఏర్పాట్లు : జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి

విజయనగరం, ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త ప్రతినిధి )



శివరాత్రి పర్వదినం సందర్భంగా శివాలయాల్లో భక్తుల దర్శనాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శివరాత్రి పండుగ ఏర్పాట్లతోపాటు ప్రభుత్వ ప్రాధాన్యత పనులు, రెవెన్యూ అంశాలు, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి బుధవారం క్షేత్రస్థాయి అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. కలెక్టరేట్ నుండి జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ తో కలిసి ఆయన రెవెన్యూ అధికారులు మండల పరిషత్ అభివృద్ధి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శివరాత్రి రోజున రామతీర్థం, పుణ్యగిరి, ధర్మవరం, సంగమేశ్వర స్వామి ఆలయం, పాల్తేరు, కోటిపల్లి శివాలయాలకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తుల తాకిడిని ముందుగానే అంచనా వేసి, అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా పకడ్బందీగా క్యూలైన్లను ఏర్పాటు చేసి, దర్శనాలకు ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా ఉచితబస్సు పథకం వల్ల, మహిళలు గతం కంటే ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని చెప్పారు. తొక్కిసలాట జరగకుండా అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రయివేటు ఆలయాలకు సంబంధించి ఆలయ కమిటీలను ముందుగానే అప్రమత్తం చేయాలని సూచించారు. అదేవిధంగా ఆలయాల సమీపంలోని జంక్షన్ల వద్ద కూడా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి, ప్రమాదాలను నివారించాలని పేర్కొన్నారు.ఆలయాలవద్ద వాహనాలను నిలిపి ఉంచేందుకు తగిన పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సంబధిత మండలాల తాహసీల్దార్లు ముందుగానే ఆలయాలను సందర్శించి తగిన ఏర్పాట్లపై ఆలయ కమిటీలతో, సంబంధిత అధికారులతోను చర్చించాలని చెప్పారు. అవసరమైతే ఎంపిడిఓ కార్యాలయాల సిబ్బందిని సైతం ఈ విధులకు వినియోగించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే వినతుల పట్ల అధికారులు సానుకూలంగా స్పందించాలని, ముఖ్యంగా రెవెన్యూ అంశాలకు సంబంధించి ఎటువంటి జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. భూమి మ్యుటేషన్లు, పట్టాదార్ పాస్ పుస్తకాల జారీలో నిబంధనల ప్రకారం గడువులోగా పనులు పూర్తి చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు.

## యువత కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి-డిసిసిబి ఛైర్మన్ కిమిడి నాగార్జున

విజయనగరం, ఫిబ్రవరి 11 ( ప్రభాతవార్త ప్రతినిధి )



యువత కష్టపడే తత్వాన్ని అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఉమ్మడి విజయనగరం జిల్లా డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం విజయనగరం డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో చీపురుపల్లి నియోజకవర్గం గుర్ల మండలం కొండ గంద్రేడు గ్రామానికి చెందిన బోడసింగి రమణ గ్రూప్-2లో డిప్యూటీ తహసిల్దార్ పోస్ట్ కు ఇటీవల ఎంపికకావడంతో ఆయనను నాగార్జున ఘనంగా సత్కరించారు. పేద కుటుంబానికి చెందిన యువకుడు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళిక బద్ధంగా కష్టపడి చదివి లక్ష్యాన్ని చేరుకోవడం గొప్ప విషయం అన్నారు. జిల్లాకు చెందిన యువత కష్టపడి ఉన్నత ఉద్యోగ, విద్యా అవకాశాలను దక్కించుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ యువతకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ఉద్యోగ ఉపాధి అవకాశాలను కల్పించడానికి పరిశ్రమలు ఏర్పాటుకు ఎనలేని శ్రమ చేస్తున్నారన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## ఎల్.కోట గ్రామంలో శివరాత్రి విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీతలపై ప్రచారం

లక్కవరపుకోట ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



ఫిబ్రవరి 15న రాబోయే శివరాత్రి పండుగ పురస్కరించుకుని "త్రైతసిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక విజయనగరం కమిటీ" సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం లక్క వరపు కోట మండల కేంద్రంలో త్రైత సిద్ధాంత భగవద్గీత మరియు అనుబంధ గ్రంథాల ప్రచారం, శివరాత్రి పండుగ పై ప్రచారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా శివరాత్రి పండుగ విశిష్టత ను గ్రామస్థులకు వివరించారు శివలింగం పైన ఉన్న "మూడు విభూతి రేఖలు జీవాత్మ ఆత్మ పరమాత్మ లకు గుర్తు" అని, ఆత్మ ను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడు అని, అందుకే "మధ్య లో ఉండే విభూతి రేఖకు ఎర్రని బొట్టు పెడుతారు".. మూడు ఆత్మ ల వివరణ తెలుసుకోవడం ఆధ్యాత్మికం లో ముఖ్యమైన విషయం గా పేర్కొన్నారు శివరాత్రి జాగరణ అంటే మాయ పట్ల జాగృతి కలిగి శ్రద్ధ గా జ్ఞానం పొంది ఇతరులకు కూడా దైవ జ్ఞానంను తెలియజేయడం అని అర్థం ఆని తెలిపారు. త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక- విజయనగరం కమిటీ అధ్యక్షుడు, సభ్యులు శంకరరావు, శంకర్రావు, ప్రసాద్, సివిఎస్ నాయుడు, వంశీ, రాజప్పుడు, శ్రీను, సూరిబాబు, రాజేష్, కోటి, లోకేష్, భానుమతి, ప్రమీన, జయలక్ష్మి, రామచంద్ర, శిరీష, లత, త్రివేణి, కృష్ణ వేణి, మీన, బంగారమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి



### కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెడి శీలం

పార్వతీపురం, ఫిబ్రవరి11, ప్రభాతవార్త:

ప్రజల్లో కూటమిపాలన పై వ్యతిరేకత కనిపిస్తోందని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కేంద్రమంత్రి, ఐఏఎస్ అధికారి జెడి శీలం అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా డీసీసీ అధ్యక్షులు వంగల దాలినాయుడు అధ్యక్షతన జిల్లా నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలపై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. లడ్డు వ్యవహారానికి తక్షణమే చరమగీతం పాడి, జరిగిన అపచారం ఎవరు చేశారనే దానిపై తక్షణమే విచారించి చర్యలు తీసుకొని వివాదానికి ముగింపు పలకాలన్నారు. ప్రజా సమస్యలు అనేకం ఉన్నాయని వాటిపై దృష్టి సారించాలన్నారు. సూపర్ సిక్స్ ఏమైందో సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని తొలగించి, బిజెపి తీసుకువచ్చిన విబి జి రాం జీ చట్టం వలన ప్రజలకు పలు సమస్యలు ఉన్నాయన్నారు. ఈ విషయంలో రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర రాష్ట్రంలో చేస్తున్నారని త్వరలో జిల్లాకు రానున్నారని తెలిపారు. తెలంగాణ తోపాటు పలు రాష్ట్రాలలో ఉన్న ప్రాంతీయ పార్టీల పాలనపట్ల ప్రజలు విసుగు చెంది కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టే రోజులు వచ్చాయన్నారు. ఆంధ్రాలో కూడా అదే పరిస్థితి వస్తుందన్నారు. జిల్లాలో జంఝావతి ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. ఐటీడీఏ గవర్నమెంట్ బాడీ నిర్వహించి గిరిజన విద్యార్థుల మృతిపై దృష్టి సారించాలన్నారు. మున్సిపాలిటీ తాగునీరు, డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కరించాలన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం వారి పార్టీ గుర్తు అయిన సైకిల్ ఫ్యాక్టరీ కూడా రాష్ట్రంలో నెలకొల్పే పరిస్థితి లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదానికి కారకుడైన శంకర్రావుకి ఆరు నెలలు జైలు శిక్ష

బండపల్లి, ఫిబ్రవరి 11,ప్రభాతవార్త

రోడ్డు ప్రమాదానికి సంబంధించిన ఓ కేసులో ముద్దాయిగా ఉన్న దత్తి రాజేరు మండలం ఎం. లింగాలవలస గ్రామానికి చెందిన కొల్లా శంకర్రావుకు ఆరు నెలల జైలుశిక్ష, వెయ్యి రూపా యలు జరిమానా విధిస్తూ స్థానిక ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఏ. విజయ్ రాజ్ కుమార్ బుధవారం తీర్పు చెప్పారు. కోర్టు సిబ్బంది అందించిన వివరాలు ప్రకారం, 2021 మార్చి 27వ తేదీన పి. ధనంజయరావ్ తన అన్నయ్య కుమారుడు ప్రత్యూష వర్ధన్ ను తీసుకుని పొలంలోకి వెళ్ళాడు. ఈ సమయంలో ప్రత్యూషవర్ధన్ రోడ్డుపైకి మలమూత్ర విసర్జన కోసం రాగా, అదే సమయంలో దత్తిరాజేరు మండలం కన్నాశీ గ్రామం నుంచి బైక్ పై వేగంగా వస్తున్న కొల్లా శంకర్రావు, ప్రత్యూష వర్ధన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ప్రత్యూషవర్ధన్ తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు గడసాం గ్రామానికి చెందిన పల్లికల లక్ష్మీనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటిలో పెదమానాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ అనంతరం మెజిస్ట్రేట్ విజయ రాజ్ కుమార్ పై విధంగా తీర్పు చెప్పారు.

## ప్రతి ఒక్కరూ సైనికుల పనిచేయాలి

### వైయస్సార్‌ను గెలిపించాలి : ధర్మాన ప్రసాదరావు

బలిజిపేట ఫిబ్రవరి 11 ప్రభాతవార్త



బలిజపేట మండలం గలవల్లి గ్రామంలో బుధవారం వైయస్సార్సీపి పార్టీ సంస్థాగత సమావేశంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రివర్యులు ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ప్రతి వాటర్ సైనికుల పనిచేసి మరల డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి తనయుడు జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసే వరకు ప్రతి ఒక్కరూ సైనికుల పోరాడి ప్రస్తుత ప్రభుత్వం కోటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు ప్రభుత్వ వైఫల్యాలు ఎండగట్టి ప్రతి ఒక్కరికి తెలియపరచి చైతన్యపరిచి సైనికుల పోరాడాలని పనిచేయాలని పిలుపునిచ్చారు ఆంధ్రప్రదేశ్ తూర్పు కాపు చైర్మన్ మామిడి శ్రీకాంత్ మాట్లాడుతూ పేట తెల్లము అయిందని ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్పి వచ్చే ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి పార్టీని బలపరచాలని తెలిపారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి పార్టీ మండల అధ్యక్షులు పాలవలస మురళి డాక్టర్ రాజేష్ జడ్పిటిసి అలజింగ్ రవికుమార్ వైఎస్ఆర్ నాయకులు అభిమానులు పాల్గొన్నారు.

## మార్చి 16 నుంచి పదోతరగతి పరీక్షలు

### హాజరు కానున్న 23,523 మంది విద్యార్థులు -జిల్లా వ్యాప్తంగా 119 పరీక్షా కేంద్రాలు

### -పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశం

విజయనగరం, ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త ప్రతినిధి )



మార్చి 16 నుంచి ఏప్రెల్ 1వ తేదీ వరకు జరిగే పదోతరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. టెన్త్, ఓపెన్ ఇంటర్ పరీక్షల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లపై తమ ఛాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, ఆయా శాఖలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సారి పదోతరగతి పరీక్షలకు జిల్లావ్యాప్తంగా 23,523 మంది హాజరు కానున్నారని, వీరిలో 22,959 మంది రెగ్యులర్, 564 మంది ప్రయివేటు విద్యార్థులు ఉన్నారని తెలిపారు. వీరికోసం 119 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతీ పరీక్షా కేంద్రాన్ని తాహసీల్దార్లు, ఎంపిడిఓలు లేదా మున్సిపల్ కమిషనర్లచేత తనిఖీ చేయించి, సోమవారం నాటికి తమకు నివేదికను సమర్పించాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణకు ఏడు ఫ్లయింగ్ స్క్వాడ్లు, 29 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నామని, సుమారు 1350 మంది ఇన్విజిలేటర్లను వినియోగిస్తున్నామని చెప్పారు. పరీక్షా కేంద్రాలవద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ విధించాలని ఆదేశించారు. స్ట్రాంగ్‌రూమ్ వద్ద చేయాల్సిన భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలను కనీసం అరగంట ముందుగానే చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. తమ పరీక్షా కేంద్రం వివరాలు హాల్‌టిక్కెట్‌పై క్యూఆర్ కోడ్ రూపంలో ముద్రించి ఉంటాయని, విద్యార్థులు స్కాన్ చేసి వాటిని చూసుకోవచ్చునని చెప్పారు. వీలైతే పరీక్షలకు ముందుగానే తమ పరీక్షా కేంద్రాన్నిచూసుకోవడం మంచిదని సూచించారు. అలాగే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకొనే విధంగా వేళలను సవరించి బస్సులను నడపాలని ఆర్టిసిని ఆదేశించారు. ప్రతీ కేంద్రంవద్ద ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షా కేంద్రాలకు విద్యుత్ సరఫరా ఆటంకం లేకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

## శివరాత్రి జాతర ఏర్పాట్లలలో ప్రతీ అధికారి బాధ్యత వహించాలి..



శృంగవరపుకోట,ఫిబ్రవరి11, ప్రభాతవార్త

రానున్న మహా శివరాత్రి జాతర వేడుకల నిర్వాహణ లో సంభందిత అధికారులందరూ బాధ్యత వహించాలని తహశీల్దార్ శ్రీనువాస రావు తెలిపారు. బుధవారం ఎస్.కోట తహ శీల్దర్ కార్యాలయంలో ఎస్.కోట పుణ్యగిరి, ధర్మవరం శ్రీసన్యాశేస్వరస్వామి ఆలయాలు వద్ద రెండు రోజుల పాటు జరగనున్న మహా శివరాత్రి జాతర మహోత్సవాలకు సంభందించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జాతర మహోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖల అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈఏడాది ఆయా ఆలయాలకు భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అందువలన ఏర్పాట్లు విషయంలో జాగ్రత్తలు పాటించాలని ఆయన తెలిపారు. మండలంలో సంభందిత శాఖాధికారులు పాల్గొన్నారు.



# శ్రీకాకుళం వార్త

## చెరుకు ఎండిపోతుందని రైతు గోల పెట్టినా పట్టించుకోని పారీస్ షుగర్స్ యాజమాన్యం



రేగిడి / సంతకవిటి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

రేగిడి మండలంలో సంకిలిలో పారీస్ షుగర్స్ చెరుకు ఫ్యాక్టరీ దగ్గర రైతుకు జరుగుతున్న నష్టం గురించి ఎవరితోనూ చెప్పుకున్నా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయింది చెరుకులు వేయమని చెప్పి చెరుకులు వేయించిన తర్వాత రైతు దగ్గర అగ్రిమెంట్ చేయించుకొని కొట్టే సమయానికి రైతులు చెరుకును ఫ్యాక్టరీ దగ్గర మూడేసి రోజులు ఎండబెడుతున్నారు. నాన్ అగ్రిమెంట్ చెరుకులు భీమ సింగ్ చోడవరం బొబ్బిలి నుంచి వచ్చిన చెరుకులను ఏరోజు చెరుకు ఆ రోజే ఆడుకోవడం జరుగుతుంది. కానీ అగ్రిమెంట్ చెరుకుల మాత్రం మూడు రోజులు ఎండబెడుతున్నారు. ఇక్కడ యాజమాన్యం ఎవరికి నచ్చింది వారు చేసుకుంటూ పోతున్నారు. రైతులను మాత్రం ఎంత మొత్తుకొని ఏడ్చిన పట్టించుకునే నాధుడే లేకుండా పోయాడు. ఏదో ఒకలాగా మూడు రోజులకు ఒకసారి అయినా అవుతుందా అనుకుంటే ఫ్యాక్టరీలో ఏదో ఒక రిపేర్ అంటూ మూడేసి గంటలు ఎప్పటిక ప్పుడు ఆపివేయడం జరుగుతుంది. రైతు దగ్గర నుంచి తెచ్చిన ట్రాక్టర్ డ్రైవర్లు మీరు ఇచ్చిన డబ్బులు మాకు చాలడం లేదు. మూడు రోజులు బట్టి మేము ఇక్కడే ఉండిపోతే మూడు పూటలు తినడానికి మాకు ఎంత ఖర్చవుతుంది. కాబట్టి మీరు అదనంగా మాకు డబ్బులు ఇవ్వాలని వాళ్లు మెరపెట్టుకుంటున్నారు. డ్రైవర్లు ఏమైనా యాజమాన్యాన్ని లారీలే ఆడుకుం టున్నారు ట్రాక్టర్లను దుకోవట్లేదు అని గట్టిగా అడిగితే అడిగిన వారి పాస్ కట్ చేస్తున్నారు వారిని ఫ్యాక్టరీ రాకుండా చేస్తున్నారు అలాగని రైతు కొట్టిన వాళ్లకి సగం తీసుకొని ట్రాక్టర్ వాళ్లకి సగం ఇస్తే ఇంకే మిగిలింది ఏముంది అంతా శూన్యమే అని రైతు చెరుకు దున్నేయడానికి తయారైతే ఈ సంవ త్సరం మీకు డబ్బులు పెంచుతాం. సక్రమంగా నడుపుతాం. చెరుకుల వేయండి అంటూ సూపర్వైజర్లు రావడం రైతును బ్రతిమాలి చెరుకులు వేయించుకోవడం జరుగుతుంది తీరా చెరుకు కొట్టే టైంకి రైతు పరిస్థితి చెరుకు మూడు రోజులపాటు ఎండలో ఎండబెట్టడం జరుగుతుంది ఈ మూడు రోజులు ఎండడం రైతుకు ఎకరం కి 32 టన్నుల నుండి 35 టన్నుల వరకు మధ్యలో వస్తే సబ్సిడీ వర్తిస్తుందని ఫ్యాక్టరీ యాజమాన్యం చెప్పడం జరిగింది . ఇదివరకు ఫ్యాక్టరీ వారు అప్పు రూపంలో ఎరువులు అందించేవారు గత సంవత్సరం నుండి అది కూడా నిలిపివేయడం జరిగింది . అలా నిలిపివేయడం వల్ల రైతుకు యూరియా దొరక్క ఎకరంకి నాలుగు యూరియా ప్యాకెట్లు వేయవలసిన వాళ్ళు రెండు ప్యాకెట్లతో వేసి సరి పెట్టుకోవడం జరిగింది ఇలా అయితే పంట దిగుబడి ఎలా వస్తుంది అని రైతులు మొత్తుకుంటున్నారు ఈ విధంగా మూడు రోజులపాటు ఎండలో ఎండితే రైతుకు ఎకరానికి 20 టన్నులు రావడం కష్టం ఆయనకు ఎలా సబ్సిడీ వర్తిస్తుంది. రైతు లబోదిబోమని ఏడ్చిన పట్టించుకునే నాధుడే లేదు ఇక్కడ ఎవరికి నచ్చింది వారు చేసుకుంటూ పోతున్నారు ఇక్కడ అగ్రిమెంట్ ఉన్న చెరుకు రైతులు మాత్రం పట్టించుకోవడం మాత్రం లేదు ఒక్కరోజు భీమసింగు చోడవరం బొబ్బిలి లారీలు మాత్రం ఉండిపోతే మాత్రం యాజమాన్యం దగ్గరుండి ఆ లారీలను లోనికి పంపడం జరుగుతుంది. ఇలా అయితే ఎవరూ చెరుకులు వేయరు కొన్నాళ్ళకి ఫ్యాక్టరీ మూతబడి పోతుందని అంటున్నారు కొందరు రైతులు చెరుకు పంట వేసి చెరుకు పంట పైనే బతుకుతున్నారు. అలాంటి రైతులు రోడ్డున పడవలసిన పరిస్థితి వస్తుంది. ఇప్పటికైనా యాజమాన్యం పట్టించుకొని ఆ అవకతవకలు లేకుండా సక్రమంగా నడిపిస్తారని రైతులు కోరుకుంటున్నారు.



## ఉగాది నాటికి లబ్ధిదారులు ఇల్లు నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు చేపట్టాలి

### సిబ్బందికి సూచనలు చేస్తున్న కమిషనర్ రామచంద్రావు



రాజాం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

కంచరాం దగ్గరలో ఉన్న అర్బన్ హౌసింగ్‌లో లబ్ధిదారులకు కేటాయించిన ప్రతి ఇల్లును నిర్మించుకునే విధంగా అవగాహన చేయాలని మున్సిపల్ కమీషనర్ ఏ.రామచంద్రరావు సంబంధిత సిబ్బందికి తెలియచేశారు. వార్డు ఎమినిటీస్ సెక్రటరీలు, హౌసింగ్ సిబ్బందితో హౌసింగ్ ప్రోగ్రెస్ మీద కమీషనర్ రివ్యూ చేశారు. మొత్తం 228 ఇళ్లకు గాను 18 ఇళ్ళు పూర్తిగా నిర్మితమై ఉన్నవి. 46 ఇళ్ల రూఫ్ లెవల్‌లో ఉన్నందున, ప్రతి ఒక్క లబ్ధిదారుని వద్దకు వెళ్లి, మాట్లాడి ప్రోగ్రెస్ పెరిగేలా చూస్తే, ఉగాదికి గృహప్రవేశాలు జరగటానికి అవకాశం ఉన్నదని కమీషనర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎ.ఇ బి.దుర్గారావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్‌లో శత శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలి



సీతంపేట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో గిరిజన విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణత సాధించాలిని ఐటిడిఏ ఉప విద్యాశాఖ అధికారి పాలక నారాయుడు స్పష్టం చేశారు. బుధ వారం సీతంపేట ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ హైస్కూల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు 100రోజుల కార్యక్రమం పక్కాగా అమలు చేయాలన్నారు. 10వ తరగతిలో ఇప్పటికి వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి వారి ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు కృషి చేయవల్సిందిగా సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ఉపాధ్యాయులంతా అప్రమత్తంగా ఉండాలని, మినరల్ వాటర్ విద్యార్థులకు అందజేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. పాఠశాలలో మస్తాబు కార్యక్రమం చక్కగా నిర్వహించాలని స్పష్టం చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేసి ఎటువంటి అనారోగ్యం లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిసిడిఓ రాములమ్మ, పాఠశాల హెచ్ఎం టి.చంద్రరావు పాల్గొన్నారు.

## కమిటీల నిర్మాణం పూర్తి స్థాయిలో జరగాలి : మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి



పాతపట్నం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:

మండలంలోని సరియాపల్లి, గంగువాడ, పెద్దలక్ష్మీపురం,తెంబూరు గ్రామాల్లోని ముఖ్య నాయకులతో వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో కమిటీల నిర్మాణం పూర్తి స్థాయిలో జరగాలని, వాటిపై దిశా నిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, నాయకులు అందరూ కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ పటిష్టత కోసం కమిటీల ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు.

## కుటుంబ సమగ్ర సర్వేను పూర్తి చేయండి



పాతపట్నం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:

మండలంలోని ఏఎస్ కవిటి, ఆర్ఎల్ పురం సచివాలయాలను బుధవారం మండల గ్రామ, వార్డు సచివాలయాల అధికారి బి.కృష్ణారావు సందర్శించారు. సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించి కుటుంబ సమగ్ర సర్వే, సిటిజన్ ఈకేవైసి పెండింగ్ సర్వేలను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రికార్డులు పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సచివాలయాల పరిధిలోని పలు గ్రామాలను సందర్శించి క్షేత్రస్థాయిలో సర్వేలపై ఆరా తీశారు.

## రైల్వే అండర్ పాసేజీ పనులు వేగవంతం చేయండి



ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:

రత్తకన్న ఎల్ సి గేటు వద్ద అండర్ పాసేజీ పనులు వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు. నార్త్ కేబిన్ అండర్ పాసేజీ దిగువ నిల్వ ఉన్న మురికి నీరు మట్టిని వాటర్ పంపు పెట్టి తొలిగించారు. తోటవీధి గ్రామస్తులు మొగళ్ళ రాంబాబు, ఎంపీటీసీ గోపిలు మాట్లాడుతూ ప్రతీ రెండు నిమషాలకు ట్రైన్‌ల రాకపోకలు వలన రైల్వే గేట్ పడుతుండడంతో వేలాదిమంది ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ఇప్పటికైనా రైల్వే అధికారులు స్పందించి కొత్తగా ఏర్పాటు కానున్న అండర్ పాసేజ్ పనులు త్వరగా జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తిప్పన కూరయ్య, శంకర్, కృష్ణకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేసారు.

## పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి



పాతపట్నం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:

అంత్యోదయ ప్రవక్త, ఏకాత్మ మానవతావాది పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి సందర్భంగా బుధవారం పాతపట్నం మండలం పెద్దలక్ష్మీపురం సర్పంచ్ ప్రతినిధి, బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అన్నెపు ఉమా మహేశ్వరరావు, బిజెపి నాయకులు దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. సమాజంలో చిట్టచివరి వ్యక్తికి ఫలాలు అందాలన్న ఆయన ఆశయ సాధన కోసం అందరం పునరంకితం కావాలని ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు పిలుపునిచ్చారు. భారత ప్రభుత్వం పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని అధికారికంగా సమర్పణ్ దివాస్ (త్యాగ దినం) గా నిర్వహిస్తోందన్నారు. మానవత్వానికి, నైతికతకు ప్రాధాన్యతనిస్తూ దీన్ దయాళ్ అందించిన సేవలు దేశాభివృద్ధికి దిశానిర్దేశం చేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

## ప్రతి రైతు రైతు గుర్తింపు సంఖ్య కలిగి ఉండాలి :మండల వ్యవసాయ అధికారి ఎస్.దానకర్ణుడు



మెళియాపుట్టి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:

మెలియాపుట్టి మండలం కొదమల, వసుంధర గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముందుగా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలన చేసి రైతులకు యాజమాన్య పద్ధతుల పైన తగిన సలహాలు, సూచనలు చేశారు. ముఖ్యంగా రబీలో పండించే మొక్కజొన్న, అపరాలు, వరి, నువ్వులు, పొద్దుతిరుగుడు మొదలైన పంటలో యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరంగా తెలిపారు. అలాగే పంటల్లో చీడపురుగులు యాజమాన్యం గురించి విపులంగా తెలిపారు. ముఖ్యంగా మొక్కజొన్నలో కత్తిరి పురుగు ఆశించి ఉన్నందువలన వేపనూనె మరియు ఎమామెసిటిన్ బెంజోట్ మందులు కలిపి పిచికారి చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులు రబీలో పండిస్తున్న పంటలు ఖచ్చితంగా గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా పంట నమోదు చేసుకోవాలని తెలియజేశారు. అనంతరం రైతులకు రైతు గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని తెలియజేశారు. ఇందులో భాగంగా మండలంలో రైతు సేవ కేంద్రంలో గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద గ్రామం వారిగా పెండింగ్ ఉన్న రైతులు జాబితా ఉన్నాయని తెలియజేశారు. రైతులందరూ కూడా గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద రైతు గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని తెలియజేశారు. రైతు గుర్తింపు సంఖ్య ఉన్నవాళ్ళకి కేంద్ర ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని తెలియజేశారు. కాబట్టి ఫిబ్రవరి నెలాఖరు లోపల ఇంకా ఎవరైనా రైతులు గుర్తింపు సంఖ్య చేసుకోనట్లయితే స్థానిక గ్రామ వ్యవసాయ సమీకరణ సంప్రదించి రైతు గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు క్రాంతి, కూటమి నాయకులు మరియు పలువురు రైతులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ టేబుల్ బహుకరణ



కంచిలి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా నిర్వహిస్తున్న విద్యాంజలి 2.0 సేవా పథకంలో భాగంగా బుధవారం కంచిలి మండలం చొట్రాయిపురం ఎంపీపీ స్కూల్‌కు పూర్వ విద్యార్థులు కంప్యూటర్ పెట్టుకొనే టేబుల్ బహుకరించారని ప్రధానోపాధ్యాయులు మద్దు తిరుపతిరావు తెలిపారు. ఇదే పాఠశాలలో 5వ తరగతి వరకు చదువుకున్న అందాల సంజన, బడ్డి నిహారిక విద్యార్థినులు ప్రస్తుతం ఉన్నత విద్యను అభ్యసిస్తూ, పూర్వ పాఠశాలకు తమ రుణం తీర్చుకోవాలనే ఉద్దేశ్యంతో, స్కూలుకు అవసరమయ్యే మౌలిక అవసరాల దృష్టిలో పెట్టుకొని, వారి తల్లిదండ్రులు అందాల సుమలత, బడ్డీ రాములమ్మ ద్వారా కంప్యూటర్ టేబుల్ అందజేశారు. మా పాఠశాల సర్వతోముఖాభివృద్ధికి నిరంతరం అన్ని విధాలుగా సహకరిస్తున్న సర్పంచ్ దొక్కరి బ్రహ్మానందం, పూర్వ విద్యార్థులకు, యువకులకు, గ్రామ పెద్దలకు ప్రధానోపాధ్యాయులు మద్దు తిరుపతిరావు, చల్ల లింగమూర్తి మాస్టర్ ధన్యవాదములు తెలియజేశారు.

## పేదవాడికి అండగా కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే సతీమణి ప్రమీల



ఆముదాలవలస, ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త)

నియోజకవర్గంలో తెలుగుదేశం కార్యకర్తలకు అండగా కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ రవికుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ కూన ప్రమీల అన్నారు. బుధవారం నియోజవర్గంలో రొట్టవలస, మర్రిపాడు, కేజీ పేట, సరుబుజ్జిలి, కనుగులవలస గ్రామాల్లో ఉన్న టిడిపి కార్యకర్తలు వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో సీఎంఆర్ఎఫ్ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా లక్షలాది రూపాయలు మంజూరైన చెక్కులను ప్రమీల అందజేశారు. కూన ప్రమీల మాట్లాడుతూ ప్రజల సమస్యలు, వైద్య అవసరాల పరిష్కారంలో ముఖ్యమంత్రి సహాయనిధి కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ఇంత పెద్ద సహాయం చేసిన ముఖ్యమంత్రికి మరియు ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు లబ్ధిదారుని కుటుంబ సభ్యులు ధన్యవాదములు తెలిపారు. డీసీసీబీ చైర్మన్ శివాల సూర్యనారాయణ, అంబాళ్ళ రాంబాబు, నూకరాజు, ఎండ అప్పలనాయుడు, పీవీకే రాజు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## దృష్టి లోపం ఉన్న వారు ప్రతి ఏడాది కంటి పరీక్షలు చేయించుకోవాలి

### వైద్యాధికారిణి డాక్టర్ నందిని ..51 మంది విద్యార్థులకు కళ్ళద్దాల పంపిణీ



సంతబొమ్మాళి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

దృష్టి లోపం ఉన్న వారు ప్రతి ఏడాది కంటి పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని సంతబొమ్మాళి పి హెచ్ సి వైద్యాధికారిణి డాక్టర్ నందిని అన్నారు. జాతీయ అంధత్వ మరియు దృష్టిలోపం నివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా అందత్వ నివారణ సంస్థ శ్రీకాకుళం ఆధ్వర్యంలో సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 51 మంది విద్యార్థులకు కళ్లద్దాలు పీహెచ్సీ వైద్యాధికారి డా. ఎన్ నందిని చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ దృష్టిలోపం ఉన్న వారంతా ప్రతి ఏడాది తప్పనిసరిగా కంటి పరీక్ష చేసుకోవాలని, సరైన వెలుతురులో చదువుకుంటూ, మొబైల్స్‌కు దూరంగా ఉంటూ కళ్ళను గాయాల బారిన పడకుండా కాపాడుకుంటూ కంటి చూపును కాపాడుకోవాలి అన్నారు. ఆప్తాల్మిక్ అధికారి ఎం.ఆర్.కే.దాస్ మాట్లాడుతూ పాఠశాలలో ఇదివరలో విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న 51 మందికి బుధవారం కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. విద్యార్థులకు 'కంటి ఆరోగ్యం సంరక్షణ'పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బి.వెంకటరావు, స్పెషల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు ఎస్.రాంబాబు, ఆరోగ్య విస్తరణాధికారి కె.శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.భాగ్యవతి ఆరోగ్య కార్యకర్త పి.గణేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## డబుల్ వీల్ మార్కర్ యంత్రం... మొక్క జొన్న రైతుల నేస్తం



రణస్థలం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు వరి మాగాణిల్లో నేరుగా మొక్కజొన్న సాగు చేసే రైతులకు వరుసల మధ్య మరియు విత్తనాల మధ్య సమాన దూరంలో విత్తుకోవడానికి డబుల్ వీల్ మార్కర్ యంత్రం చాలా ఉపయోగకరంగా ఉందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. బుధవారం రణస్థలం మండలంలోని పైడిభీమవరం గ్రామంలో తమ సంస్థ ఆధ్వర్యంలో పునరుత్పాదక వ్యవసాయ విధానాలను రైతులకు అందించే కార్యక్రమంలో భాగంగా వరి కోతల అనంతరం నేరుగా మొక్కజొన్న సాగు చేసేందుకు అనువైన 700 డబుల్ వీల్ మార్కర్ యంత్రాలను పరిసర మండలాల లీడ్ ఫార్మర్స్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత పదేళ్లగా జిల్లా రైతులకు సులభమైన యాంత్రీకరణ విధానాలపై ఎప్పటికప్పుడు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడమే కాక, అవసరమైన యంత్ర పరికరాలను రైతులకు అందిస్తూ రైతుల జీవనోపాధుల కల్పనకు ఎంతగానో కృషి చేస్తున్నామని గుర్తు చేశారు. దున్నకుండా మొక్కజొన్న సాగు చేపట్టడం వలన అదనపు సాగు ఖర్చులు, సుమారు 2,3 నీటి తడులు ఆదాచేయవచ్చని ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. గ్రామస్థాయిలో లీడ్ ఫార్మర్స్ వద్ద డబుల్ వీల్ మార్కర్స్ అందుబాటులో ఉంచామని, వాటిని రైతుల పరస్పర సహకారంతో సక్రమంగా వినియోగించుకుంటూ మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెంచేందుకు కృషి చెయ్యాలని కోరారు. కార్యక్రమంలో సమీప మండల పరిధిలో లీడ్ ఫార్మర్స్, సంస్థ సమన్వయ కర్తలు ఎ.వెంకటరమణ, ఎస్.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి రూ.కోటి విరాళం అందించిన పూర్వ విద్యార్థి

### -ఆడిటోరియం నిర్మించాలని సూచించిన డాక్టర్ విశ్వనాథం



సంతబొమ్మాళి, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

చదివిన పాఠశాల రుణం తీర్చుకోవాలని భారీ విరాళం ప్రకటించారు ఓ ఎన్ఆర్ఐ. సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం ఉన్నత పాఠశాలలో 1966 బ్యాచ్‌లో పదోతరగతి చదివి ప్రస్తుతం వైద్య వృత్తిలో అమెరికాలో స్థిరపడిన పూర్వ విద్యార్థి డాక్టర్ లమ్మత విశ్వనాథం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల దండుగోపాలపురంలో విద్యనభ్యసించిన లమ్మత విశ్వనాథం (ఎండిఎఫ్ ఏసిసి)డాక్టర్‌గా అమెరికాలో స్థిరపడిన అతని జీవిత గమనాన్ని నా జీవనయానం కాశీపురంలో మొదలై అనే పేరున ఆత్మకథగా చింతాడ కృష్ణారావు రచించారు. రచయిత కూడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దండుగోపాలపురం పూర్వ విద్యార్థి కావడం గమనార్హం. పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని కోత మహాలక్ష్మి అప్పన్న మెమోరియల్ సర్వీసు ఆర్గనైజేషన్ సంస్థ వారు నిర్వహించగా, పుస్తకాన్ని సంతబొమ్మాళి మాజీ జడ్పీటీసీ ఎల్ ఎల్.నాయుడు ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా అప్పటి 1961 పదవ తరగతి బ్యాచ్ 18 మందిలో కొంతమంది పరమ పదించగా మిగిలిన 13 మంది ఈరోజు అపూర్వ కలయిక 60 సంవత్సరాల క్రితం జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ పాఠశాలకు విచ్చేసి ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతుగా ఒక కోటి రూపాయలు విరాళాన్ని ఆడిటోరియం నిర్మాణానికి వెచ్చించవల సిందిగా కోరుతూ ప్రకటించారు. దీని పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కమిటీ సభ్యులు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. సంస్థ అధ్యక్షులు కోత చిన్నబాబు, కార్యదర్శి కోత మధుసూదనరావు, ధర్మారావు, సతీష్, వాసు మాస్టర్, ప్రదానోపాధ్యాయులు పిట్ట గంగన్న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి ఉపాధ్యాయులు భాస్కరరావు, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, శారదాంబ, అన్నాజీరావు, జె.శ్రీనివాసరావు, మురళీధర రాజు, రాము, సూర్య ప్రకాష్, ఉమ, విజయలక్ష్మి, డి.శ్రీనివాసరావు, దయాసాగర్, శ్రీధర్, మార్కండేయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## రైతు బజార్ లేక రైతు విలవిల

### దళారుల చేతిలో చిక్కుకున్న అన్నదాత...! నిర్ణీత ధర లేక దళారుల చెప్పిందే శాసనం...! కోల్డ్ స్టోరేజీ లేక కుళ్లిపోతున్న పంటలు... ! కన్నీరు పెడుతున్న రైతులు, రోడ్లపైనే విక్రయాలు...! నిత్యం నరకప్రాయంగా ట్రాఫిక్...!



కొత్తూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త :

అహోరాత్రులు కష్టపడి, చెమటోడ్చి పండించిన పంటకు గిట్టుబాటు ధర దక్కక, అమ్ముకునేందుకు సరైన వేదిక లేక కొత్తూరు మండల కేంద్రంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు చుట్టుపక్కల ఉన్న సీతంపేట, భామిని మండలాలతో పాటు పొరుగు రాష్ట్రమైన ఒడిశా నుంచి కూడా నిత్యం వందలాది మంది రైతులు తమ పంటను ఇక్కడికి తీసుకువస్తారు. అయితే, దశాబ్దాలు గడుస్తున్నా ఇక్కడ ఒక రైతు బజార్ గానీ, కోల్డ్ స్టోరేజీ గానీ లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. అయితే మండల కేంద్రంలో ప్రభుత్వ మార్కెట్ లేకపోవడంతో దళారులదే రాజ్యంగా మారింది. ప్రతిరోజూ తెల్లవారుజామున 3 గంటల నుంచే రైతులు కూరగాయలతో ఇక్కడికి చేరుకుంటారు. రైతులకు వేరే ప్రత్యామ్నాయం లేకపోవడంతో దళారులు నిర్ణయించిన ధరకే పంటను అమ్ముకోవాల్సి వస్తోంది. వంకాయలు, టమోటా, క్యారెట్, మునక్కాయలు, ఆకుకూరలు వంటి టన్నుల కొద్దీ దిగుబడి వస్తున్నా కనీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. నిర్దేశిత మార్కెట్ ప్రాంగణం లేకపోవడంతో నివగాం, బత్తిలి రహదారిపైనే రైతులు తమ ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. నిత్యం 250 నుండి 300 మంది రైతులు రోడ్డుపైనే బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఆరుబయటే వ్యాపారం సాగించాల్సిన దుస్థితి నెలకొంది. పంచాయతీకి ఆశీలు రూపంలో ఆదాయం వస్తున్నా, రైతులకు కనీస షెల్టర్లు కూడా కల్పించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలానికి చెందిన కొందరు రైతులు మాట్లాడుతూ కొత్తూరులో వినియోగదారులకు నేరుగా అమ్ముకునేలా తక్షణమే రైతు బజార్ నిర్మించాలని అలాగే ధర లేనప్పుడు కూరగాయలను నిల్వ చేసుకునేందుకు శీతల ఉగ్రాణం ఏర్పాటు చేయాలి మరియు దళారుల దోపిడీని అరికట్టి, పంటకు గిట్టుబాటు ధర దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండలానికి చెందిన కొందరు రైతులు డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇకనైనా స్పందించి మా కన్నీళ్లు తుడవాలి అని కొత్తూరు ప్రాంత రైతులు వేడుకుంటున్నారు.

## నిరక్షరాస్యలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



కవిటి, ఫిబ్రవరి 11 (ప్రభాతవార్త)

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీడీవో యల్.త్రినాథ్ అన్నారు. బుధవారం మండలం కౌటి పంచాయితీ గొన్యాలపుట్టుగ, కొత్తూరు గ్రామాల్లో అక్షర కేంద్రాలను వాటి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో త్రినాథ్‌తో పాటు ఏవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా అందరికీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దవలసిన బాధ్యత ఉందని అన్నారు విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంజిఓ బివిఎస్ రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

## డిఈవో ఆకస్మిక తనిఖీ



ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:

ఇచ్ఛాపురం మండలంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె.రవిబాబు ఆకస్మిక పర్యటన చేపట్టారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొలిగాం, హరిపురం, బిర్లంగి, మున్సిపల్ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, 100 రోజుల పదవ తరగతి యాక్షన్ ప్లాన్, 30 రోజుల 10వ తరగతి వసతిగృహ విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాలు పరిశీలించారు. కొలిగాం పాఠశాలలో ఎఫ్ఏ 4 పరీక్షల నిర్వహణను విద్యార్థులతో చర్చించారు. భిర్లంగి పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. బాలికోన్నత, బాలుర పాఠశాలల్లో విద్యార్థుల పుస్తకాలు పరిశీలించారు. ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఉపాధ్యాయులకు సమీక్షా సమావేశం నిర్వహించి పదవ ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత దిశగా కృషి చేయాలని ఉపాధ్యాయులను సూచించారు. బాలుర వసతి గృహాన్ని సందర్శించి 30రోజుల ప్రణాళిక ప్రాప్తికి విద్యార్థులు అభ్యాసన సామర్థ్యాలు పెంపొందించుకోవాలని విద్యార్థుల్ని సూచించారు. పరీక్షల పట్ల భయం వీడి ఉత్తీర్ణత దిశగా అర్థవంతమైన అభ్యాసన చేపట్టాలని, దీనికి ఉపాధ్యాయులు నిత్య పర్యవేక్షణ చేస్తూ విద్యార్థుల అభ్యాసన సందేహాలు నివృత్తి చేయాలని సూచించారు. ఇరువురు మండల విద్యాశాఖాధికారులు అప్పారావు, విశ్వనాథం, ప్రధానోపాధ్యాయులు సూర్యారావు పాల్గొన్నారు.

## అటవీ శాఖ ద్వారా పర్యటక ప్రాంతం అభివృద్ధి ..జిల్లా ఫారెస్ట్ అధికారి ప్రసున్న



సీతంపేట, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త

అటవీ శాఖ ద్వారా పర్యటక ప్రాంతం అభివృద్ధి చేపట్టడం జరుగుతుందని మన్యం జిల్లా అటవీ శాఖ అధికారి ప్రసున్న స్పష్టం చేశారు. బుధవారం ధోనుబాయి, చిన్న బగ్గా రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న జయపురం బెనరాయ్, మెట్టు గూడ బంగి గూడ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యటకులను ఆకర్షించే విధంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో ట్రెక్కింగ్ వాటర్ ఫాల్ అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా జయపురం దోనుబాయి మెట్టు గూడ. బంగి గూడ ట్రెక్కింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. అదేవిధంగా బెనరయ వాటర్‌ఫాల్ కూడా తమ శాఖ ద్వారా పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాలకొండ అటవీ శాఖ రేంజ్ అధికారి కే.రామారావు సోషల్ ఫారెస్ట్ రేంజర్ లక్ష్మీనరసింహ తదితరులు పాల్గొన్నారు.

## పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, వీరభద్రేశ్వర స్వామి వార్షికోత్సవం



జలుమూరు, ఫిబ్రవరి 11 ప్రభాతవార్త:

మండలంలోని లింగాలవలస గ్రామంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, వీరభద్రేశ్వర స్వామి 30వ వార్షికోత్సవం ఈ నెల 13 శుక్ర వారం నుండి 15వ తేదీ ఆదివారం వరకు వైభవంగా నిర్వహిస్తు న్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ సన్నిధిలో విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో వీర బ్రహ్మేంద్రస్వామి గోవిందమ్మల కళ్యాణము మాఘ బహుళ త్రయోదశి రాత్రి 7 గంటలకు శనివారం జరుగునని తెలిపారు. మహా శివరాత్రి పర్వదినం ఆదివారం, అదే రోజు రాత్రి 12 గంటలకు లింగాలవలస గ్రామ పురోహితులు పురిపండా వెంకటరమణమూర్తి నిర్మల దంపతులచే 'లింగోద్భావము' జరిపిస్తారని తెలిపారు. ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు వీర బ్రహ్మేంద్రస్వామి, వీరభద్రేశ్వర స్వామి వార్ల 'తిరువీధి' కార్యక్రమం జరుగుతున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ పంచాయతీ పురజనులు, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## వసప కేజీబీవీ విద్యాలయం ఆకస్మిక తనిఖీ

### జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ఎంపీడీఓ పర్యవేక్షణ



కొత్తూరు, జనవరి 11 ప్రభాతవార్త :

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు, వసప కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో బుధవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపిడిఓ మరియు పంచాయతీ కార్యదర్శి ఈ తనిఖీలో పాల్గొన్నారు. తనిఖీ బృందం విద్యాలయంలోని స్టోర్ రూమును క్షుణ్ణంగా పరిశీలించి, స్టాక్ రిజిస్టర్లను నిశితంగా పరిశీలించారు. కిచెన్ రూమ్, బాత్రూమ్‌లు, వసతి గృహాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. పాఠశాల ఆవరణ పారిశుద్ధ్య స్థితిని కూడా పరిశీలించి, నిర్వహణపై తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా, విద్యార్థినుల ఆరోగ్యం, విద్య రెండింటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ టి.కలావతమ్మ, ఉపాధ్యాయులు, మరియు వార్డెన్లకు పలు సూచనలు, సలహాలు అందించారు. ముఖ్యంగా, రాబోయే నెల రోజులలో జరగనున్న పదవ తరగతి ఫైనల్ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థినులకు సంబంధించి, మెరుగైన ఫలితాలు సాధించేందుకు అవసరమైన తగు సూచనలను కూడా ఈ బృందం అందించింది. ఈ ఆకస్మిక తనిఖీ ద్వారా విద్యాలయం నిర్వహణలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందే అవకాశం ఉంది.

